thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 88 | జగిత్యాల | గురువారం | 25 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

**ఐసీసీ ర్యాంకింగ్స్ లో భారత ఆటగాళ్ల జోరు**



11

## ఇరాన్‌కు ఎలాంటి డబ్బూ ఇవ్వడం లేదు



- ఆస్తుల విడుదల ప్రశ్నే లేదు.. : ట్రంప్
- అణు కేంద్రాల తనిఖీలకు అనుమతి లేదన్న ఇరాన్

4

## ఎస్ఐఆర్ జాబితాలో పేరు లేకుంటే రేషన్ ఇవ్వరా?

ఎస్ఐఆర్‌లో పేరు తొలగించబడిన వారికి రేషన్ సరఫరా నిలిపివేస్తున్నారంటూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది.




- పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ప్రశ్నలు
- ముందు హైకోర్టును ఆశ్రయించండి
- పిటిషనర్‌కు సూచన

4

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఇరాన్ ఆహ్వానం

- జులై 4 నుంచి 9 వరకు కార్యక్రమాలు
- ప్రధాని హాజరుపై ఇంకా స్పష్టత లేదు

4





## 72 సార్లు ఢిల్లీకి.. సాధించిందేంటి?

**రేవంత్ రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యూవల్ సీఎం!**

- ముగ్గురు మంత్రులున్నా ఖమ్మంకు ఒరిగిందేమీ లేదు
- 80 శాతం ప్రాజెక్టును పూర్తి చేసింది కేసీఆరే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది రెగ్యులర్ పోస్ట్ కాదని, ఆయనొక రెన్యూవల్ సీఎం మాత్రమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన ఈ 2.5 ఏళ్లలో ఏకంగా 72 సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగిన ఆయన.. రాష్ట్రానికి సాధించిందేమీ లేదని విమర్శించారు. బుధవారం సత్తుపల్లిలో పర్యటించిన కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, కేసీఆర్ పాలన రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.

## పోరాటం తప్పదు!

- కర్ణాటక అక్రమ ప్రాజెక్టులతో పాలమూరుకు ముప్పు
- సీఎం రేవంత్ కు హరీశ్ రావు బహిరంగ లేఖ

2



# పనిచేయండి.. లేదా తప్పుకోండి

పనిచేయని నేతలను వదులుకునేందుకు సిద్ధం

**ఎమ్మెల్యేలైనా, మంత్రులైనా ఉపేక్షించం**

**ఎవరెలా పనిచేస్తున్నారో నా దగ్గర రిపోర్ట్ ఉంది**

**తీరు మార్చుకోకుంటే 10 రోజుల్లో కొత్త ఇన్‌ఛార్జ్‌లు**



- ఎస్ఐఆర్ ప్రక్రియను సీరియస్‌గా తీసుకోకుంటే యాక్షన్ తప్పదు
- బూత్ స్థాయి నుంచే ప్రతి ఓటును కాపాడుకోవాలి
- ఓటర్ల జాబితా సవరణపై సీఎం సీరియస్
- కాంగ్రెస్ నేతలకు రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్
- ఓట్ల తొలగింపు కుట్రలపై అప్రమత్తంగా ఉండాలన్న మహేష్ గౌడ్
- ఆక్సిజన్‌లా ఓటు హక్కును పరిరక్షించాలన్న మీనాక్షి నటరాజన్

...వివరాలు 2లో

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తేలిగ్గా తీసుకుంటున్న కాంగ్రెస్ నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత కఠినమైన వార్నింగ్ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడని వారు ఎమ్మెల్యేలైనా, నియోజకవర్గ బాధ్యతలు చూసే ఇన్‌ఛార్జ్ మంత్రులైనా సరే.. ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. క్షేత్రస్థాయిలో ఎవరెలా పనిచేస్తున్నారో తన వద్ద పక్కా నివేదిక ఉందని స్పష్టం చేసిన సీఎం.. నాయకులు తమ పనితీరు మార్చుకోవడానికి కేవలం 10 రోజుల గడువు మాత్రమే విధించారు. ఈ డెడ్‌లైన్ ముగిసేలోపు వారిలో అలసత్వం వీడకపోతే, ఏమాత్రం మొహమాటం లేకుండా ఆ పదవుల నుంచి తప్పించి.. వారి స్థానంలో చురుకుగా పనిచేసే కొత్త వారిని నియమిస్తామని ఆయన ఘాటుగా హెచ్చరించారు. మరోవైపు ప్రతిపక్షాలు పకడ్బందీగా లౌకికవాద ఓట్లను తొలగించేందుకు భారీ కుట్రలు పన్నుతున్నాయని, ఆ కుట్రలను బూత్ స్థాయి నుంచే తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందని పార్టీ అధిష్టానం గట్టిగా దిశానిర్దేశం చేసింది. ప్రతి మనిషికీ ప్రాణవాయువు లాంటి ఓటు హక్కును కాపాడుకోవడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా భవిష్యత్తులో తీవ్ర నష్టం తప్పదని నేతలకు స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే జూమ్ సమావేశం వేదికగా పని దొంగల పనిపట్టేలా సీఎం రేవంత్ ఈ స్థాయి తీవ్ర హెచ్చరికలు జారీ చేయడం కాంగ్రెస్ వర్గాల్లో ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



## తుంగభద్ర జలాలపై తగ్గేదే లే!

కర్ణాటక అక్రమ ప్రాజెక్టులపై రాష్ట్ర సర్కారు సీరియస్

తుంగభద్ర, ఆర్డీఎస్, అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టుల నేపథ్యంలో.. తుంగభద్ర జలాల్లో తెలంగాణ వాటా విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

- జలసౌధలో మంత్రులు, అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష
- పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరాల వెల్లడి

వివరాలు 2లో..

## హాస్టల్‌లో ప్రసవించి.. కిటికీలోంచి విసిరేసి!

గోల్కొండలోని ఓ బాలికల హాస్టల్‌లో దారుణం

3

## బీఆర్ఎస్ నేతలను నమ్మొద్దు!

- తండ్రీ, కొడుకు, కూతురు, అల్లుడు మాయమాటలు
- తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన గత సర్కారు
- కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు నిజమైన సంక్షేమం
- జూన్ 30న రైతు సభను జయప్రదం చేయండి
- ఖమ్మంలో మంత్రులు భట్టి, తుమ్మల పిలుపు

2

## మహిళలు ఎదిగితే.. అణిచివేతే!

రాజకీయాల్లోకి వస్తే కావాలనే టార్గెట్ చేస్తున్నారు

ఏది మాట్లాడినా దారుణమైన ట్రోలింగ్

మహిళా సాధికారత సదస్సులో కవిత ఆవేదన



2

సమాజంలో మహిళలు ఎదుగుతుంటే వెంటనే తొక్కేసే ప్రయత్నం చేస్తున్నారని, రాజకీయాల్లోకి వస్తే కావాలనే టార్గెట్ చేస్తున్నారని బీఆర్ఎస్ నేత కవిత ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో జరిగిన మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న ఆమె.. మహిళలపై వివక్ష, కెరీర్ సవాళ్లు, బాల్య వివాహాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు.

2



## బాల్క సుమన్‌కు ఊరట!

- సింగరేణిపై వివాదాస్పద వ్యాఖ్యల కేసులో బెయిల్
- 25 వేల బాండ్, ఇద్దరి పూచీకత్తుకు హైకోర్టు షరతు

3

## వైభవంగా ఆషాఢ బోనాలు!



- ఉత్సవాల నిర్వహణకు 20 కోట్ల నిధులు
- జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు సందడి
- ఏర్పాట్లపై లండన్ నుంచి మంత్రి కొండా సురేఖ సమీక్ష
- సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశాలు

# మహిళలు ఎదిగితే.. అణిచివేతే!

**రాజకీయాల్లోకి వస్తే కావాలనే టార్గెట్ చేస్తున్నారు**

**ఏది మాట్లాడినా సోషల్ మీడియాలో దారుణమైన ట్రోలింగ్**

**మగాళ్లు, ఆడవాళ్లు అనే రెండే కులాలు మిగిలాయి**

**2026లోనూ ఆగని బాల్య వివాహాలు**

**మహిళా సాధికారత సదస్సులో కవిత ఆవేదన**




**హైదరాబాద్ :** సమాజంలో మహిళలు ఎదుగుతుంటే వెంటనే తొక్కేసే ప్రయత్నం చేస్తున్నారని, రాజకీయాల్లోకి వస్తే కావాలనే టార్గెట్ చేస్తున్నారని బీఆర్ఎస్ నేత కవిత ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో జరిగిన మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న ఆమె.. మహిళలపై వివక్ష, కెరీర్ సవాళ్లు, బాల్య వివాహాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. రాజకీయాల్లో తాను ఏ విషయం మాట్లాడినా సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేస్తున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆడవాళ్లు రాజకీయాల్లోకి వస్తే ఇలాగే టార్గెట్ చేస్తారనే భావనతోనే కొందరు కావాలనే ఈ ట్రోలింగ్‌కు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రపంచంలో ఇప్పటికీ లింగ వివక్ష కొనసాగుతోందని, అనేక రంగాల్లో మగవారికే ప్రాధాన్యం లభిస్తోందని చెప్పారు. సమాజంలో కులాల కంటే.. మగాళ్ల కులం, ఆడవాళ్ల కులం అనే రెండే ఉన్నాయనిపిస్తోందని ఆమె వ్యాఖ్యానించారు.

## పోలీసు శాఖలో పూర్తికాని రిజర్వేషన్లు..

తెలంగాణ వచ్చాక పోలీసు శాఖలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తెచ్చుకున్నా.. అది ఇంకా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని కవిత అన్నారు. ఐటీ, బ్యాంకింగ్, మీడియా రంగాల్లో మహిళలు ఎంతో సత్తా చాటుతున్నా.. పెళ్లి, కుటుంబ బాధ్యతల వల్ల కెరీర్‌కు బ్రేక్ పడి మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తోందన్నారు. అందుకే మహిళలకు ప్రభుత్వాలు, కుటుంబం, సమాజం పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రస్తుత జెన్–జెడ్ తరంలోనూ అమ్మాయిలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఇప్పటికీ ఆందోళనకరం..

రాష్ట్రంలో బాల్య వివాహాలపై కవిత దిగ్భ్రాంతికరమైన గణాంకాలను బయటపెట్టారు. 2026లోనూ తెలంగాణ గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. 15 నుంచి 19 ఏళ్ల వయసులోనే తల్లులవుతున్న వారి సంఖ్య గ్రామీణ ప్రాంతాల్లో 7.2 శాతం ఉంటే.. హైదరాబాద్ లాంటి మహానగరంలో 2.7 శాతం ఉండటం ఆందోళనకరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కవిత కీలక సూచనలు చేశారు. సోషల్ మీడియాలో లైక్‌లు, ఫాలోవర్లు రాలేదని ఏమాత్రం నిరుత్సాహపడొద్దని సూచించారు. మహిళలంతా ఒక మంచి లక్ష్యం పెట్టుకుని, దాన్ని సాధించే దిశగా బలమైన గొంతుకతో ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు.

# వైభవంగా ఆషాడ బోనాలు!

**ఉత్సవాల నిర్వహణకు 20 కోట్ల నిధులు**

**జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు సందడి**

**ఏర్పాట్లపై లండన్ నుంచి మంత్రి కొండా సురేఖ సమీక్ష**

**సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశాలు**

**హైదరాబాద్ :** తెలంగాణ సంస్కృతికి, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే ఆషాడ మాస బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. ఈ ఏడాది ఉత్సవాల కోసం ఏకంగా 20 కోట్ల రూపాయలను కేటాయించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ ఆదేశించారు.



ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న మంత్రి కొండా సురేఖ.. బుధవారం జూమ్ వేదికగా బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి దేవాలయంలో బోనాల ఉత్సవాలు ప్రారంభమై, ఆగస్టు 13 వరకు అట్టహాసంగా కొనసాగుతాయని వెల్లడించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ఈ వేడుకలు జరగనున్నాయి.

## భక్తులకు సకల సదుపాయాలు..

ప్రభుత్వం కేటాయించిన 20 కోట్ల నిధులతో ఆలయాల్లో మౌలిక వసతులు, భక్తులకు సదుపాయాలు, విద్యుత్ దీపాలంకరణలు, సీసీ కెమెరాలు, క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లు పక్కాగా చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. వృద్ధుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం 'లాక్టేషన్ రూమ్'లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## అదనపు బస్సుల కోసం వినతి..

కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు సౌకర్యం ఉన్నందున.. రాష్ట్ర నలుమూలల నుంచి బోనాల ఉత్సవాలకు మహిళా భక్తుల తాకిడి భారీగా ఉంటుందని మంత్రి అంచనా వేశారు. రద్దీకి తగినట్లుగా అదనపు బస్సులు నడపాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. దేవాదాయ, జీహెచ్ఎంసీ, పోలీసు, విద్యుత్, జలమండలి, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య తదితర శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి భద్రతతో కూడిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవాలకు భారీగా నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా మంత్రి సురేఖ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# పనిచేయండి.. లేదా తప్పుకోండి!

- ఎమ్మెల్యేలైనా, మంత్రులైనా ఉపేక్షించం
- పనిచేయని నేతలను వదులుకునేందుకు సిద్ధం
- ఎవరెలా పనిచేస్తున్నారో నా దగ్గర రిపోర్ట్ ఉంది
- తీరు మార్చుకోకుంటే 10 రోజుల్లో కొత్త ఇన్‌ఛార్జ్‌లు
- కాంగ్రెస్ నేతలకు రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్

**హైదరాబాద :** ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను ఉపేక్షించే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పనిచేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. బుధవారం కాంగ్రెస్ ముఖ్య నేతలతో నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన ఈ మేరకు ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో గురువారం నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో కాంగ్రెస్ అప్రమత్తమైంది. ఇందులో భాగంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలతో పార్టీ అధిష్టానం జూమ్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేయని



నాయకులను తప్పించేందుకు వెనుకాడబోమని తేల్చిచెప్పారు. పనితీరు మార్చుకునేందుకు 10 రోజుల సమయం ఇస్తున్నామని, అప్పటికీ మార్పు రాకపోతే యాక్టివ్‌గా ఉన్న మరొకరిని ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సీరియస్‌గా తీసుకోని ఎమ్మెల్యేలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరెవరు పనిచేయడం లేదో తన వద్ద నివేదిక ఉందని, పద్ధతి మార్చుకోకపోతే తదుపరి సమావేశంలో పేర్లు బయటపెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. బాధ్యత తీసుకోని ఇన్‌ఛార్జ్ మంత్రులను కూడా మారుస్తామని తేల్చిచెప్పారు.

## కుట్రలను తిప్పికొట్టాలి..

లౌకికవాద ఓట్లను తొలగించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని, దీనిని సమర్థవంతంగా తిప్పికొట్టాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. అలాగే పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల నిర్వహణలో జరిగిన పరిణామాలను పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గద్వాల, మల్కాజిగిరి, భువనగిరి, నిజామాబాద్‌లలో పార్టీ పరిస్థితి కాస్త బలహీనంగా ఉందని, మెజారిటీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండటం సరికాదన్నారు. ఓటు హక్కు అనేది ప్రతి మనిషికి ఆక్సిజన్ లాంటిదని ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అభివర్ణించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎంతో కష్టపడితే ఈ హక్కు వచ్చిందని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ఆమె సూచించారు.

# తుంగభద్ర జలాలపై తగ్గేదే లే!

- కర్ణాటక అక్రమ ప్రాజెక్టులపై రాష్ట్ర సర్కారు సీరియస్
- జలసౌధలో మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష
- పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరాల వెల్లడి



**హైదరాబాద్ :** తుంగభద్ర, ఆర్డీఎస్, అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టుల నేపథ్యంలో.. తుంగభద్ర జలాల్లో తెలంగాణ వాటా విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. జలసౌధలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, సీఎంవో కార్యదర్శి మాణిక్ రాజ్, ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. తుంగభద్రపై ఉన్న నీటిపారుదల పరిస్థితులపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.

## కర్ణాటక అక్రమ కట్టడాలు..

ఆర్డీఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీమ్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణకు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని సుమారు 85 కోట్ల రూపాయలతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తోంది. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అనుమతులు లేకుండానే ఈ పనులు చేపడుతోందని ఆరోపణలు ఉన్నాయి.

## నిబంధనల ఉల్లంఘన..

ఇప్పటికే ఆర్డీఎస్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు సరిగా అందడం లేదు. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో ఆ రాష్ట్ర వాటా కేవలం 1.2 టీఎంసీలు మాత్రమే. కానీ సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తోందని గణాంకాలు చెబుతున్నాయి. తుంగభద్ర జలాలను ఇష్టారాజ్యంగా వినియోగించకుండా బచావత్ ట్రిబ్యునల్ నిబంధనలను కృష్ణా అవార్డులో పొందుపరిచినా.. వాటిని ఏమాత్రం ఖాతరు చేయడం లేదు.

## దెబ్బతిననున్న ప్రాజెక్టులు..

కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం కేవలం ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులకే పరిమితం కాదు. తుంగభద్ర నుంచి శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలు తగ్గితే.. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు తాగునీటి అవసరాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. భవిష్యత్తు నీటి ప్రణాళికలు దెబ్బతింటాయి. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన నిర్మిస్తున్న ప్రాజెక్టుల వల్ల ఆయకట్టు పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితులన్నింటినీ గమనించిన సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్షించి భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించారు. తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని.. ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని మాజీ మంత్రి హరీశ్ రావు సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి ఆయన ఒక లేఖ రాసి విడుదల చేశారు.

# మళ్లీ పోరాటం తప్పదు!

- కర్ణాటక అక్రమ ప్రాజెక్టులతో పాలమూరుకు ముప్పు
- ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టులు ఎండిపోతాయి
- తెలంగాణ జల హక్కులను పొరుగు రాష్ట్రాలకు తాకట్టు పెడతారా?
- నీటి వాటాల కోసం బీఆర్ఎస్ నిరంతర పోరాటం చేస్తుంది
- ముఖ్యమంత్రి రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ

**కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోకపోతే ఉమ్మడి పాలమూరు జిల్లా ఎడారిగా మారడం ఖాయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను పక్క రాష్ట్రాలకు తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక బహిరంగ లేఖ రాశారు. స్వార్థ రాజకీయాల కోసం జల హక్కులను వదులుకుంటే చూస్తూ ఊరుకోబోమని.. రైతుల పక్షాన మరో భారీ పోరాటానికి సిద్ధమవుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు.**



**హైదరాబాద్ :** తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. కర్ణాటక చేపడుతున్న అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోకపోతే పాలమూరు జిల్లా ఎడారిగా మారుతుందని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్‌కు ఆయన ఒక బహిరంగ లేఖ రాశారు. జల హక్కులు కాపాడుకునేందుకు మళ్లీ ఉద్యమించాల్సిన పరిస్థితి తీసుకురావొద్దని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నీటి దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ సాధించుకున్నామని హరీశ్ రావు గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను మళ్లించి పాలమూరు లాంటి వలసల జిల్లాను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసిందన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ జల హక్కులను పక్క రాష్ట్రాలకు తాకట్టు పెట్టే ప్రమాదకర విధానాలను అవలంబిస్తోందని లేఖలో మండిపడ్డారు. గోదావరి జలాలను తీసుకెళ్లేందుకు ఏపీకి సహకరిస్తున్న సర్కారు.. ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలోనూ అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తోందని ఆరోపించారు.

## అక్రమ ప్రాజెక్టులపై ఎందుకు మౌనం?

తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి, చిక్కాలపర్వి, చిక్కాలమంచి ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలిపిందా అని హరీశ్ రావు నిలదీశారు. 2025 జూలై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్ఓసీ ఇవ్వడం వెనుక జరిగిన చీకటి ఒప్పందం ఏమిటని ప్రశ్నించారు. ఏడాదిగా ఆ ప్రాజెక్టుల పనులు 60 శాతం పూర్తయినా రాష్ట్ర ప్రభుత్వం గాఢ నిద్రలో ఉందా అని ధ్వజమెత్తారు. రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని మళ్లించేందుకు 85 కోట్లతో కురిడి ఎత్తిపోతలను నిర్మిస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. కేంద్ర జల సంఘం, కృష్ణా బోర్డుల అనుమతులు లేకుండానే కర్ణాటక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆ ప్రాజెక్టులు నిర్వీర్యం..

ఆర్డీఎస్ ప్రాజెక్టులో కర్ణాటక వాటా కేవలం 1.2 టీఎంసీలు మాత్రమేనని, కానీ ఆ రాష్ట్రం 5 టీఎంసీల నీటిని వాడుకుంటూ అదనపు సాగు చేస్తోందని హరీశ్ రావు పేర్కొన్నారు. ఇప్పుడు ఆర్డీఎస్ ఆనకట్టకు కేవలం 100 మీటర్ల ఎగువన అక్రమ ఎత్తిపోతలు పూర్తయితే.. ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ఆయకట్టుకు చుక్క నీరు రాదని ఆవేదన వ్యక్తం చేశారు. 16.94 టీఎంసీల కేటాయింపు ఉన్న భీమా ప్రాజెక్టు నుంచి సుమారు 7 టీఎంసీలను కొడంగల్ లిఫ్ట్‌కు మళ్లించి 2 లక్షల ఎకరాలకు సాగునీరందించే భీమాను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు.

## పోరాటం ఆగదు..

కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల ప్రభావం శ్రీశైలం జలాశయానికి వచ్చే ప్రవాహాలపైనా పడుతుందని హరీశ్ రావు స్పష్టం చేశారు. దీనివల్ల కల్వకుర్తి, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు భవిష్యత్ తాగునీటి అవసరాలు దెబ్బతింటాయన్నారు. స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడితే చూస్తూ ఊరుకోబోమని.. తెలంగాణ జల హక్కుల కోసం బీఆర్ఎస్ ఎంతవరకైనా పోరాడుతుందని ఆయన హెచ్చరించారు.

# 72 సార్లు ఢిల్లీకి.. సాధించిందేంటి?

- రేవంత్ రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యూవల్ సీఎం!
- ముగ్గురు మంత్రులున్నా ఖమ్మం జిల్లాకు ఒరిగిందేమీ లేదు
- 80 శాతం సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసింది కేసీఆరే
- మళ్లీ గులాబీ బాస్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- సత్తుపల్లి పర్యటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**ఖమ్మం:** రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని, ఆయనొక రెన్యూవల్ సీఎం అని ఎద్దేవా చేశారు. బుధవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో పర్యటించిన ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మళ్లీ కేసీఆర్ పాలన రావాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గద్దెనెక్కినప్పటి నుంచి 72 సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగారని, కానీ రాష్ట్రానికి ఆయన సాధించిందేమీ లేదని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏ వర్గాన్నీ వదలకుండా కాంగ్రెస్ సర్కారు వేధిస్తోందని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడంలో, అన్నదాతలకు రైతుబంధు అందించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సత్తుపల్లిలో కొందరు విలేకరులకు అక్రిడిటేషన్ల జారీలో ప్రభుత్వం పక్షపాతంతో వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ.. గెలిస్తే పొంగిపోవద్దని, ఓడితే కృంగిపోవద్దని పార్టీ శ్రేణులకు సూచించారు.

### సీతారామ ప్రాజెక్టు కేసీఆర్ ఘనతే..

ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కేసీఆర్ గోదావరి జలాలతో సీతారామ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని కేటీఆర్ గుర్తుచేశారు. దానికి భద్రాద్రి రామయ్య పేరు పెట్టి, 10 వేల కోట్ల అంచనాతో పనులు మొదలుపెడితే, అందులో 8 వేల కోట్లను బీఆర్ఎస్ ప్రభుత్వమే ఖర్చు చేసి 80 శాతం పనులు పూర్తి చేసిందన్నారు. దీని ద్వారా సత్తుపల్లి నియోజకవర్గంలోనే 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. గతంలో జలయజ్ఞం పేరిట కాంగ్రెస్ నేతలు ప్రాజెక్టులకు కేవలం రాళ్లు వేసి వదిలేశారని విమర్శించారు.

### ఆ ముగ్గురు మంత్రులు చేసిందేంటి?

ఖమ్మం జిల్లా నుంచే డిప్యూటీ సీఎం, రెవెన్యూ, వ్యవసాయ శాఖల మంత్రులు ఉన్నారని, పవర్ అంతా ఇక్కడే ఉన్నా.. ఈ 2.5 ఏళ్లలో జిల్లాకు వారు చేసిందేమీ లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. కీలక పదవుల్లో ఉన్న ఆ 3గురు నేతలు ఖమ్మం రైతులకు ఏం మేలు చేశారో ప్రజలు ఆలోచించాలని కోరారు. రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించాలంటే కేసీఆర్ పాలన రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ నేతలను నమ్మొద్దు!

- తండ్రీ, కొడుకు, కూతురు, అల్లుడు మాయమాటలు
- తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన గత సర్కారు
- కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు నిజమైన సంక్షేమం
- జూన్ 30న రైతు సభను జయప్రదం చేయండి
- ఖమ్మంలో మంత్రులు భట్టి, తుమ్మల పిలుపు



**ఖమ్మం :** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని, ఆ నలుగురు (కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావు) మాయమాటలు చెబుతూ తిరుగుతున్నారని.. వారి మాటలను ప్రజలు అస్సలు నమ్మవద్దని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసమే పనిచేస్తోందని, ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం 'రైతు ఆశీర్వాద సభ' సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరమ్మ కాలంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు. కానీ గత బీఆర్ఎస్ పాలనలో లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పదేళ్లలోనే కుంగిపోయిందని విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలతో సహా చెల్లిస్తోందన్నారు.

### హామీలన్నీ అమలు చేశాం..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే ఎన్నికల్లో ఇచ్చిన ఎన్నో హామీలను నెరవేర్చిందని భట్టి తెలిపారు. 1.10 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా కల్పిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేల కోట్లతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేల కోట్లు చెల్లించామని, మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి 13 వేల కోట్లు కేటాయించామని వివరించారు. ఓటు హక్కు చాలా విలువైందని, బూత్ లెవల్ ఏజెంట్లు ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ 30న మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### రైతు పక్షపాతి కాంగ్రెస్..

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గత రెండున్నరేళ్ల కాలంలో రైతు భరోసాకు 36 వేల కోట్లు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండకు సిటీ బస్సులొచ్చేశాయ్!

- జెండా ఊపి ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి
- మహిళలు, విద్యార్థులకు ఉచిత ప్రయాణ సదుపాయం
- 1.20 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ పనులకు శంకుస్థాపన
- మోడల్ సిటీగా నల్గొండ పట్టణం అభివృద్ధి
- ధర్వేశిపురం ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాల్లో మంత్రి




**నల్గొండ :** నల్గొండ పట్టణ ప్రజల రవాణా కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం సిటీ బస్సు సేవలను అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం నల్గొండలో తొలి విడతగా 2 సిటీ బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. ఇదే క్రమంలో బస్టాండ్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, ధర్వేశిపురం ఆలయ బ్రహ్మోత్సవాల్లోనూ ఆయన పాల్గొన్నారు. పట్టణంలో మహిళలు షాపింగ్, ఇతర అవసరాల కోసం ఆటోలపై ఆధారపడి ఇబ్బందులు పడుతున్నారని.. వారి కోసమే ఈ సిటీ బస్సులను అందుబాటులోకి తెచ్చామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. మెడికల్ కాలేజీ విద్యార్థులు ఆసుపత్రికి వెళ్లేందుకు కూడా ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇందులో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. చెరువుగట్టు-ఎస్ఎల్బీసీ మార్గంతో పాటు ధర్వేశిపురం నుంచి దుప్పలపల్లి వరకు ఈ సిటీ బస్సులు నడుస్తాయని స్పష్టం చేశారు. జిల్లాకు అదనంగా 30 బస్సులు కేటాయించినట్లు వెల్లడించారు.



### 1.20 కోట్లతో బస్టాండ్ విస్తరణ..

నల్గొండ ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, ఆధునికీకరణ కోసం 1.20 కోట్ల రూపాయలతో చేపట్టే పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కొత్త కౌంటర్లు, వెయిటింగ్ హాల్స్, మరుగుదొడ్లు, ఆధునిక ప్లాట్ ఫామ్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పనుల కోసం అదనంగా మరో 5 కోట్లు వెచ్చించనున్నట్లు చెప్పారు. 56 మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ పంప్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ తాగునీటి సరఫరా కోసం 83 కోట్లతో వాటర్ ఫిల్టర్ వ్యవస్థను తీసుకొస్తున్నామని, నల్గొండను ఒక మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని మంత్రి ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, మేయర్ బుర్రి చైతన్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఎల్లమ్మ తల్లికి పట్టువస్త్రాలు..

కనగల్ మండలం ధర్వేశిపురంలో జరిగిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాల్లో మంత్రి కోమటిరెడ్డి పాల్గొన్నారు. అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా దేవాలయం నుంచి కల్యాణ మండపం వరకు మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులతో కలిసి రేణుక ఎల్లమ్మ, జమదగ్ని మహర్షి దివ్య కల్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

# హాస్టల్‌లో ప్రసవించి.. కిటికీలోంచి విసిరేసి!

### గోల్కొండలోని ఓ బాలికల హాస్టల్‌లో దారుణం
### వాష్‌రూమ్‌లో బిడ్డకు జన్మనిచ్చిన విద్యార్థిని
### కిందపడి పసికందు మృతి.. కలకలం రేపిన ఘటన

**హైదరాబాద్ :** గోల్కొండ ప్రాంతంలోని ఓ బాలికల హాస్టల్‌లో దారుణం వెలుగుచూసింది. ఓ విద్యార్థిని హాస్టల్ వాష్‌రూమ్‌లో ప్రసవించి, పుట్టిన బిడ్డను కిటికీ (వెంటిలేటర్) నుంచి బయటకు విసిరేసింది. కిందపడిన ఆ పసికందు ప్రాణాలు వదిలింది. అసలు ఆ యువతి గర్భవతి అన్న విషయం హాస్టల్ సిబ్బందికి కూడా తెలియకపోవడం తీవ్ర కలకలం రేపుతోంది. గోల్కొండలోని ఓ బాలికల హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థిని అకస్మాత్తుగా బాత్‌రూమ్‌లో బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఆ పసికందును వెంటిలేటర్ నుంచి కిందకు పడేయడంతో ఆ చిన్నారి మృతి చెందినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పసికందు మృతికి గల కచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక ద్వారా వెల్లడి కానున్నాయి. అయితే ఈ ఘటనలో ప్రధానంగా వినిపిస్తున్న ప్రశ్న.. యువతి గర్భవతి అన్న విషయం హాస్టల్ సిబ్బందికి ఏమాత్రం తెలియకపోవడం. ఇన్ని రోజులుగా అక్కడే ఉంటున్న విద్యార్థిని గర్భం దాల్చినా ఎవరూ గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు.

### బావ పాత్ర ఉందా?

ప్రసవం తర్వాత తీవ్ర అస్వస్థతకు గురైన ఆ యువతిని చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. మరోవైపు, శిశువు మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ దారుణ ఘటనతో హాస్టల్‌లోని తోటి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. యువతి గర్భానికి, శిశువు మృతికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా యువతి బావ పాత్రపై కూడా బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం. దర్యాప్తు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి.

# దివ్యాంగురాలిపై పైశాచికం!

### ఎల్బీనగర్ పరిధిలో దారుణం
### ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై లైంగికదాడి
### నిందితుడి కోసం పోలీసుల గాలింపు

**హైదరాబాద్ :** నగరంలోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగుచూసింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ దివ్యాంగురాలిపై గుర్తుతెలియని దుర్మార్గుడు లైంగికదాడికి ఒడిగట్టాడు. బాధితురాలికి మాట్లాడే, వినికిడి శక్తి లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఈ దారుణానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి లోపలికి చొరబడిన దుండగుడు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ దాడి క్రమంలో బాధితురాలి మెడ, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. జరిగిన దారుణాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

### దర్యాప్తు ముమ్మరం..

ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ఎల్బీనగర్ పోలీసులు రంగంలోకి దిగారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం వెంటనే ఆసుపత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల దృశ్యాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశామని, త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# బాల్క సుమన్‌కు ఊరట!

### సింగరేణిపై వివాదాస్పద వ్యాఖ్యల కేసులో బెయిల్
### 25 వేల బాండ్, ఇద్దరి పూచీకత్తుకు హైకోర్టు షరతు
### పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని ఆదేశం



**హైదరాబాద్ :** సింగరేణి సంస్థ, యాజమాన్యంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గతంలో బాల్క సుమన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీయడంతో సింగరేణి యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసుపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. సుమన్‌కు షరతులతో కూడిన బెయిల్ ఇస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం బాల్క సుమన్ 25 వేల రూపాయల వ్యక్తిగత బాండ్‌తో పాటు, ఇద్దరు వ్యక్తుల పూచీకత్తు సమర్పించాలనే నిబంధనపై ఈ బెయిల్ లభించింది. అరెస్టు భయం లేకుండా బెయిల్ రావడం ఆయనకు పెద్ద ఉపశమనం కలిగించింది. కోర్టు విధించిన నిబంధనలకు కచ్చితంగా కట్టుబడి ఉండాలని, పోలీసుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

# తాగి నడిపితే.. 7 రోజులు జైలుకే!

### డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి శిక్ష

**నిజామాబాద్ :** మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఓ వ్యక్తికి న్యాయస్థానం 7 రోజుల జైలు శిక్ష ఖరారు చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. నిజామాబాద్ రూరల్ టౌన్ పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో షేక్ హబీబ్ అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించగా అతడు మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అతడిని బుధవారం ప్రత్యేక జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. నిందితుడి నేరం రుజువు కావడంతో కోర్టు అతడికి 7 రోజుల సాధారణ కారాగార శిక్ష విధించింది. కోర్టు ఆదేశాల మేరకు సదరు నిందితుడిని నిజామాబాద్ సెంట్రల్ జైలుకు తరలించినట్లు రూరల్ టౌన్ ఎస్సై సునీల్ వెల్లడించారు. వాహనదారులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని ఆయన సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.



# అయోధ్య రామయ్యా.. ఏమిటీ అపచారం!

అందరి బంధువయ్యా...అయోధ్య రామయ్యా అంటూ పాడుకునే హిందువులకు అయోధ్య అన్నా, రాముడన్నా విడదీయరాని బంధం ఉంది. ఎవరికి వారు అయోధ్య రాముడు తమవాడని భావిస్తారు. అందుకే అయోధ్య ఆలయ నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురు చూశారు. కోట్ల రూపాయలు ఆలయం కోసం విరాళంగా ఇచ్చారు. ఇంతటి పవిత్ర కార్యక్రమం జరిగి, ఆలయ నిర్మాణం పూర్తయిన తరవాత ఇప్పుడు నిధుల దారిమళ్లింపు గోల అందరినీ కలచి వేస్తోంది. నిజంగానే ఇది ఘోరమైన అపచారంగానే భావించాలి. రాముడిని నమ్మి భక్తులు భక్తితో సమర్పించిన కానుకలను కాజేస్తే ఎలా? రాముడి తిరిగొచ్చాడంటూ.. దేశవ్యాప్తంగా జరిగిన సంబరాలను అప్పుడే మరచిపోలేదు.అయోధ్య రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగినట్లు వెల్లడయ్యింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం విరాళాల సొమ్ము చోరీకి గురైనట్లు బలమైన ఆధారాలను కనుగొంది. దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను త్వరలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు సిట్ సమర్పించనుంది. కొన్ని రోజులుగా అయోధ్యలో సిట్ బృందం ముమ్మరంగా విచారణ జరిపింది. ఆలయ హుండీల నుంచి సేకరించిన నగదును లెక్కించే సమయంలో సీసీటీవీ ఫుటేజ్‌పై చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. కొన్ని కీలకమైన సీసీటీవీ దృశ్యాలను కావాలనే డిలీట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తులు సమర్పించిన బంగారం, వెండి, వజ్రాభరణాల ను నకిలీ వాటితో మార్చేసారనే ఆరోపణలపై సిట్ లోతుగా విచారించింది. నిర్లక్ష్యంతో పాటు దీని వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే దిశగా అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు.అయోధ్య రామాలయానికి రోజూ పెరుగు తున్న భక్తుల తాకిడి చూసి.. పులకిస్తున్న మనసులు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. ఇంతలోనే మహాపచారం జరిగిపోయిందన్న వార్త కలవరపెడుతోంది. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సమర్పిస్తున్న విరాళాలు, కానుకలు మాయమయ్యా యన్న ఆరోపణలు అయోధ్యలో కలకలం రేపాయి. మొదట్లో ఇవి ఉట్టి ఆరోపణలే అని భావించిన వారు కూడా..తర్వాత సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించడంతో అంతా దిగ్భ్రమకు గురయ్యారు. చివరకు సిట్ ప్రాథమిక విచారణలోఅడుగుడగునా నిర్లక్ష్యం నిజమేనని బయటపడటం.. సీసీ టీవీ ఫుటేజ్‌లో మార్పులు.. అన్నీ కలిసి రామభక్తుల మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీశాయినే చెప్పాలి. ఎంతో భక్తితో, నమ్మకంతో, విశ్వాసంతో రాముడి ఆలయానికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ఇచ్చిన విరాళాలు కొందరు స్వార్థపరుల చేతిలోకి వెళ్లిపోయాయని, ఆలయ వ్యవహారాలు చూసే ట్రస్టే.. కంచే చేను మేసిన చందంగా వ్యవహరి స్తోందని తెలిసి.. భక్తులు నిర్ఘాంతపోతున్నారు. దీనిపై పెద్దగా ప్రచారం రాకుండా చూస్తున్న తీరు ఇంకా కలచివేస్తోంది. ఐదు వందల సంవత్సరాల తర్వాత రామాలయం కొలువుదీరిందని ఓవైపు భక్తులో సంతోషపడుతుంటే.. మరోవైపు ఆలయంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారం హిందువుల మనోభావా లను దెబ్బతీసే వ్యవహారంగానే చూడాలి. మొదట్లో నిధులు దారిమళ్లాయనే ఆరోపణలు వచ్చినప్పుడు.. వాటిని రాజకీయ ప్రేరేపితంగా కొట్టిపారేసే ప్రయత్నం జరిగింది. కానీ భక్తుల నుంచి అభ్యంతరాలు రావడంతో.. యూపీ సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ విషయంలో సీరియస్‌గానే ఉన్నట్లుగా కనిపిస్తోంది. సిట్ దర్యాప్తులో అన్నీ తెలుస్తాయని, కొంచెం ఓపిక పట్టాలని ఆయన చేసిన విజ్ఞప్తిని బట్టి తెలుసుకోవచ్చు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే..వచ్చేయేడు యూపి ఎన్నికలకు ముందు జరిగిన ఈ వ్యవహారం యోగా ప్రభుత్వానికి మచ్చలాంటిదే. మ-రోవైపు రాముడి పేరు చెప్పి.. పెద్ద మొత్తంలో సొమ్ము స్వాహా చేశారని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. వచ్చే ఏడాది యూపీ ఎన్నికల తరుణంలో..రామాలయంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం..సంచలనం సృష్టిస్తోంది. ఈ భారీ అక్రమాలకు సంబంధించి సిట్ ఇప్పటివరకు ట్రస్ట్ అధికారులు, మేనేజ్‌మెంట్ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులతో సహా దాదాపు 150 మందిని ప్రశ్నించింది. ట్రస్ట్ కార్యనిర్వాహకుడు అనిల్ మిశ్రా, కన్స్ట్రక్షన్ ఎయిడ్ గోపాల్ రావు పాత్రలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కూడా ప్రస్తుతం నిఘా నీడలో ఉన్నారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఎస్‌బీఐ, టీసీఎస్‌లకు చెందిన ఆరుగురు ఉద్యోగుల ను కూడా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో తిన్ను యాదవ్ అనే వ్యక్తితో పాటు కొందరు బ్యాంక్ సిబ్బందిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యే అవకాశం ఉంది. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే నగదు, బంగారం, వెండి, ఇతర ఖరీదైన విరాళాలు అక్రమార్కుల భోజ్యం అయినట్టు దర్యాప్తు సంస్థ గుర్తించింది. ముఖ్యంగా ఇంత ప్రతిష్టాత్మకమైన పెద్ద ఆలయ నిర్వహణలో ముఖ్య విభాగాలు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు జవాబుదారీతనం లేకపోవడం, వారిపై పర్యవేక్షణ, నిఘా లోపించడం, సీసీటీవీ ఫుటేజీలు అదృశ్యం కావడం దర్యాప్తు సంస్థను ఆశ్చర్యపరిచింది.ట్రస్ట్‌కు చెందిన కీలక అధికారులు దర్యాప్తు పూర్తయ్యే వరకు అయోధ్య విడిచి వెళ్లకూడదని సిట్ ఆదేశించింది. ఆలయ నిర్వహణలో పారదర్శకత కోసం కాశీ విశ్వనాథ్ ఆలయం తరహాలోనే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణను పెంచాలని సిట్ సూచించనుంది. అలాగే విరాళాల లెక్కింపునకు బ్యాంకులు కేవలం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే నియమించాలని, క్రమం తప్పకుండా ఆడిటింగ్ నిర్వహించాలని నివేదికలో సిఫార్సు చేయనున్నట్లు చెబుతున్నారు. అయోధ్య విరాళాలపై ఏర్పడిన వివాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ స్పందించారు. ప్రజలు 15 రోజులు ఆగాలని కోరారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులు ఎవరైనా, ఎంతటివారైనా వదిలిపెట్టబోమంటూ హామీనిచ్చారు. మొత్తంగా రాముడి పేరు చెప్పి నిర్వాహకులే టోపీ పెట్టడం ఇప్పుడు తీవ్ర చర్చగా మారింది.

# ఇరాన్‌కు ఎలాంటి డబ్బూ ఇవ్వడం లేదు: ట్రంప్

- ఆస్తుల విడుదల ప్రశ్నే లేదు.. అవసరమైతే ఆహారం అందిస్తాం
- అణు కేంద్రాల తనిఖీలకు అనుమతి లేదన్న ఇరాన్



**న్యూయార్క్/టెహ్రాన్, జూన్ 24:** ఇరాన్‌కు అమెరికా ఎలాంటి ఆర్థిక సాయం అందించడం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్‌కు చెందిన ఆస్తులను విడుదల చేసే ఆలోచన కూడా తమకు లేదని తేల్చిచెప్పారు. అవసరమైతే మానవతా దృక్పథంతో ఆహారం కొనుగోలు చేసి అందించగలమని పేర్కొన్నారు. హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై ఎలాంటి టోల్ ఛార్జీలు లేవని, నౌకాయానానికి ఇరాన్ అంగీకరించిందని తెలిపారు. మంగళవారం తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ చేసిన పోస్టు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఇరాన్‌కు సంబంధించిన నిధుల విషయంలో అమెరికా వైఖరిని ఆయన స్పష్టంచేశారు. ఆంక్షల సడలింపుల నేపథ్యంలో అన్‌ఫ్రీజ్ అయ్యే లేదా అమెరికా ట్రెజరీ ద్వారా విడుదలయ్యే నిధులు నేరుగా ఇరాన్ ప్రభుత్వానికి వెళ్లవని తెలిపారు. ఆ నిధులన్నీ అమెరికా నియంత్రణలో ఉండే ప్రత్యేక ఎస్క్రో ఖాతాల్లోనే కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇరాన్ ఆ నిధులను కూడా పూర్తిస్థాయిలో స్వేచ్ఛగా వినియోగించుకోలేదని ట్రంప్ వెల్లడించారు. ఆహారం, ఔషధాలు, వైద్య సామగ్రి వంటి మానవతా అవసరాల కోసం మాత్రమే ఆ మొత్తాలను వినియోగించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అమెరికా జాతీయ భద్రతకు విఘాతం కలిగించేలా ఎలాంటి నిధులు విడుదలయ్యే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఇరాన్ అణు కేంద్రాల తనిఖీలపై మరోసారి ఉద్రిక్తత నెలకొంది. టెహ్రాన్‌లో అణు తనిఖీలు చేపట్టనున్నట్లు అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) ప్రధాన అధికారి రఫాయెల్ గ్రోసీ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా దెబ్బతిన్న తమ అత్యంత సున్నితమైన అణు కేంద్రాలు, అణు పదార్థాల నిల్వ ప్రాంతాలను పరిశీలించేందుకు ఐఏఈఏకు ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెం ఘరీబాబాది స్పష్టం చేశారు. దేశ భద్రత, సార్వభౌమాధికారానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి రాజీ ఉండదని ఆయన పేర్కొన్నారు.

## మళ్లీ తెరపైకి అణు వివాదం

ఇరాన్ అణు కార్యక్రమంపై ఇప్పటికే అమెరికా, పాశ్చాత్య దేశాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు తమ అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత ప్రయోజనాల కోసమేనని ఇరాన్ వాదిస్తోంది. అయితే తాజా పరిణామాలతో అణు తనిఖీల అంశం మరోసారి అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇరాన్‌కు నిధుల విడుదల, అణు కేంద్రాల తనిఖీలు, హోర్ముజ్ జలసంధి భద్రత వంటి అంశాలపై అమెరికా-ఇరాన్ మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతుండటంతో రానున్న రోజుల్లో పరిస్థితులు ఎలా మారతాయన్న దానిపై అంతర్జాతీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# ఎస్‌ఐఆర్ జాబితాలో పేరు లేకుంటే రేషన్ ఇవ్వరా?

**పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ప్రశ్నలు**

**ముందు హైకోర్టును ఆశ్రయించండిం**

**పిటిషనర్‌కు సూచన**




**న్యూఢిల్లీ, జూన్ 24 :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)లో పేరు తొలగించబడిన వారికి రేషన్ సరఫరా నిలిపివేస్తున్నారంటూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా "ఓటర్ల జాబితాలో పేరు లేకపోతే రేషన్ ఇవ్వరా?" అంటూ అత్యున్నత న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, పరిపాలనా నిర్ణయాలకు సంబంధించిన ప్రత్యేక అంశమని అభిప్రాయపడిన సుప్రీంకోర్టు, రాజ్యాంగంలోని ఆర్టికల్-32 కింద నేరుగా తమను ఆశ్రయించడం కంటే ముందుగా సంబంధిత హైకోర్టును సంప్రదించాలని పిటిషనర్‌కు సూచించింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫున హాజరైన న్యాయవాది ఎస్. ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు, పిటిషనర్‌కు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసుకునే స్వేచ్ఛ ఉందని స్పష్టం చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. రేషన్ నిరాకరణకు సంబంధించిన వివాదంపై కోల్‌కతా హైకోర్టులో తగిన న్యాయపరమైన పరిహారం కోరవచ్చని పేర్కొంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో పేరు లేకపోవడాన్ని ఆధారంగా చేసుకుని రేషన్ వంటి సంక్షేమ పథకాల లబ్ధిని నిరాకరించడం సరైందేనా అనే అంశంపై న్యాయ, రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై కోల్‌కతా హైకోర్టు ముందు విచారణ జరిగే అవకాశం ఉండటంతో తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

# ఆ ఆగ్రహంతోనే కాక్రోచ్ ఉద్యమం..

- విద్యార్థుల సమస్యలపై పోరాటం కొనసాగుతుంది
- జైరాం రమేష్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, జూన్ 24 :** నీట్ పరీక్ష వివాదం నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థుల నిరసనలు కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసిన "కాక్రోచ్ ఉద్యమం" వెనుక యువతలో పెరుగుతున్న అసంతృప్తి, ఆగ్రహమే ప్రధాన కారణమై ఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడిన జైరాం రమేష్, ఈ ఉద్యమం ఆవిర్భావంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. కొందరు దీనిని "డీప్ స్టేట్" ప్రాయోజిత ఉద్యమంగా అభివర్ణిస్తుంటే, మరికొందరు యువతలో పేరుకుపోతున్న నిరాశ, అసంతృప్తికి ఇది ప్రతిబింబమని భావిస్తున్నారని చెప్పారు. "కాక్రోచ్ ఉద్యమం ఎలా ప్రారంభమైందనే విషయంలో భిన్న వాదనలు ఉన్నాయి. కొందరు దీనిని వ్యవస్థీకృతంగా నడిపిస్తున్న ఉద్యమమని అంటున్నారు. మరికొందరు యువతలోని ఆగ్రహం, నిరాశకు ఇది ప్రతిబింబమని చెబుతున్నారు. ఈ రెండు వాదనల్లో ఏది నిజమో నిర్ధారించడం కష్టం. అయితే ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందన్నది వాస్తవం" అని జైరాం రమేష్ పేర్కొన్నారు. కాక్రోచ్ ఉద్యమం ఒక రాజకీయ పార్టీ కాదని, ప్రజాస్వామ్యంలో చివరకు రాజకీయ పార్టీలే సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన స్పష్టం చేశారు. యువత అసంతృప్తిని వెలుగులోకి తీసుకురావడంలో ఈ ఉద్యమం ఒక వేదికగా పనిచేసిందని, అయితే ఆ సమస్యలను పరిష్కార దిశగా తీసుకెళ్లాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలదేనని అన్నారు.

## విద్యార్థులతో రాహుల్ మమేకం

విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని జైరాం రమేష్ తెలిపారు. ఇటీవల రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థులతో సమావేశమైన రాహుల్ గాంధీ, త్వరలో ప్రయాగ్‌రాజ్, పాట్నా, ఢిల్లీ నగరాల్లో కూడా విద్యార్థులతో చర్చలు జరపనున్నారని వెల్లడించారు. రాహుల్ గాంధీ కేవలం నీట్ లేదా ఇతర పరీక్షల వివాదాలకే పరిమితం కావడం లేదని, దేశ విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను లేవనెత్తుతున్నారని జైరాం రమేష్ అన్నారు.



పరీక్షల నిర్వహణ, విద్యా విధానం, ప్రభుత్వ పెట్టుబడులు, కోచింగ్ వ్యవస్థ ప్రభావం వంటి అంశాలపై సమగ్ర చర్చ అవసరమన్నారు. కోటాలో విద్యా ర్థులతో జరిగిన సమావేశంలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, భారత కుటుంబాలు కోచింగ్ కేంద్రాలపై ఖర్చు చేస్తున్న మొత్తంతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వం విద్యపై తక్కువగా ఖర్చు చేస్తోందని ఆయన పేర్కొన్నారని జైరాం రమేష్ గుర్తుచేశారు. ఇది దేశ విద్యా వ్యవస్థలో ఉన్న అసమతుల్యతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యలు, పరీక్షల పారదర్శకత, విద్యా సంస్కరణలపై కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని జైరాం రమేష్ స్పష్టం చేశారు.

# ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఇరాన్ ఆహ్వానం

- జులై 4 నుంచి 9 వరకు కార్యక్రమాలు
- ప్రధాని హాజరుపై ఇంకా స్పష్టత లేదు



**న్యూఢిల్లీ/టెహ్రాన్, జూన్ 24 :** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరుకావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అధికారిక ఆహ్వానం పంపినట్లు దౌత్య వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఖమేనీ మరణించిన అనంతరం వాయిదా పడిన అంత్యక్రియలను వచ్చే నెల ఘనంగా నిర్వహించేందుకు ఇరాన్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు జులై 4న టెహ్రాన్‌లో ప్రారంభమై, జులై 9న ఆయన స్వస్థలమైన మషాద్‌లో ఖననంతో ముగియనున్నాయని ఇరాన్ అధికారిక మీడియా ప్రకటించింది. టెహ్రాన్, ఖోమ్, మషాద్ నగరాల్లో పలు దశల్లో సంతాప సభలు, అంతిమ యాత్రలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు వివిధ దేశాల అధినేతలు, ప్రభుత్వ ప్రతినిధులు, దౌత్య బృందాలను ఆహ్వానిస్తున్నట్లు సమాచారం. భారత్‌తో ఇరాన్‌కు ఉన్న సుదీర్ఘ వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాల దృష్ట్యా ప్రధాని మోదీకి ప్రత్యేక ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది.

## మోదీ వెళ్తారా..? ప్రతినిధి బృందమా..?

ఇరాన్ నుంచి వచ్చిన ఆహ్వానంపై భారత ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా అంత్యక్రియలకు హాజరవుతారా, లేక భారత తరఫున ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని పంపుతారా అన్న అంశంపై దౌత్య వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## భారత్-ఇరాన్ సంబంధాలకు ప్రాధాన్యం

భారత్, ఇరాన్ మధ్య ఇంధన భద్రత, వాణిజ్యం, చాబహార్ నౌకాశ్రయం అభివృద్ధి, ప్రాంతీయ భద్రత వంటి అంశాల్లో కీలక సహకారం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఖమేనీ అంత్యక్రియల్లో భారత ప్రాతినిధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, భారత ప్రభుత్వం తీసుకునే నిర్ణయం రెండు దేశాల దౌత్య సంబంధాల పరంగా కూడా కీలకంగా మారే అవకాశం ఉంది. ఇరాన్ అధికారిక ప్రకటన ప్రకారం జులై 4న టెహ్రాన్‌లో వీడ్కోలు కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం ఖోమ్‌లో ప్రత్యేక సంతాప కార్యక్రమాలు నిర్వహించి, జులై 9న మషాద్‌లోని ఇమామ్ రెజా పవిత్ర క్షేత్రం సమీపంలో ఖమేనీ భౌతికకాయాన్ని ఖననం చేయనున్నారు.

# ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీఐ, ఎస్సై



**కుల్కచర్ల మండలం, జూన్,24:**

ఘనాపూర్ క్రాస్ రోడ్ సమీపంలో మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నేపథ్యంలో పరిగి సీఐ కొండల్ రెడ్డి, ఆర్ & బి శాఖ ఏఈ మహేష్ మరియు కుల్కచర్ల ఎస్‌హెచ్ఓ రమేష్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.ప్రమాద స్థలంలో వాహనదారుల భద్రత దృష్ట్యా వేగ నియంత్రణ కోసం రంబ్లర్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడంతో పాటు, హెచ్చరిక సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్ & బి శాఖ అధికారులకు సూచించబడింది.రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రతి వాహనదారుడి బాధ్యత. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా కుల్కచర్ల పోలీసులు ఈ క్రింది సూచనలు చేస్తున్నారు:జంక్షన్లు, క్రాస్ రోడ్లు, గ్రామాల సమీపంలో తప్పనిసరిగా వేగాన్ని తగ్గించాలి.రోడ్డు మలుపులు, టీ–జంక్షన్లు మరియు యూ–టర్న్‌ల వద్ద జాగ్రత్తగా వాహనం నడపాలి.ద్విచక్ర వాహనదారులు మరియు వెనుక కూర్చున్న వారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలి.నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలి.మద్యం సేవించి లేదా మత్తు పదార్థాల ప్రభావంలో వాహనం నడపరాదు.మొబైల్ ఫోన్ మాట్లాడుతూ, మెసేజ్‌లు పంపుతూ లేదా సోషల్ మీడియా ఉపయోగిస్తూ వాహనం నడపరాదు.ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేయరాదు.ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్ మరియు ప్రమాదకర ఓవర్‌టేకింగ్‌లను పూర్తిగా నివారించాలి. ఎదురుగా వస్తున్న వాహనాలకు అవకాశం ఇవ్వాలి మరియు ట్రాఫిక్ నియమాలను పాటించాలి. రాత్రి వేళల్లో డిప్పర్ లైట్లు ఉపయోగించాలి మరియు హై బీమ్‌ను అవసరమైనప్పుడు మాత్రమే వినియోగించాలి.వర్షాకాలంలో రోడ్లు జారుడుగా ఉండే అవకాశం ఉన్నందున అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి.వాహనం నడిపే ముందు బ్రేకులు, టైర్లు, హెడ్‌లైట్లు మరియు ఇండికేటర్లు సరిగా పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేసుకోవాలి.అలసటగా ఉన్నప్పుడు లేదా నిద్రమత్తులో ఉన్నప్పుడు వాహనం నడపకూడదు.రోడ్డు సంకేతాలు, హెచ్చరిక బోర్డులు మరియు ట్రాఫిక్ పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి.ప్రతి ఒక్కరూ "మీ కుటుంబం మీ కోసం ఎదురుచూస్తోంది" అనే బాధ్యతతో సురక్షితంగా వాహనం నడపాలి."వేగం కంటే ప్రాణం ముఖ్యం – రోడ్డు భద్రత అందరి బాధ్యత."ప్రజలందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలని కుల్కచర్ల పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రెండో విడత ఎప్పుడో..?

- **జూన్ 2 ప్రకటనతోనే సరిపెట్టిన ప్రభుత్వం**
- **ఇంకా మొదలు కాని లబ్ధిదారుల ఎంపిక**
- **గుడిసెల సర్వేతో మారిన పరిస్థితులు**
- **ఆశగా ఎదురుచూస్తున్న అర్హులు**



**రాయపోల్,జూన్ 24:**

ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత కోసం ఎదురుచూస్తున్న పేదలకు నిరాశే మిగులుతోంది. జూన్ 2 నుంచి రెండో విడత లబ్ధిదారుల ఎంపిక చేపడతామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులు ఆందోళన చెందుతున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి కేటాయించిన ఇళ్లలో కొన్నింటి నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్ని వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. అయితే మొదటి విడతలో అవకాశం దక్కని వేలాది మంది రెండో విడతపై ఆశలు పెట్టుకున్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు అర్హుల జాబితాలను సిద్ధం చేసిన ప్పటికీ, తదుపరి చర్యలు ముందుకు సాగడం లేదు. ఇటీవల గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే నిర్ణయంతో ఎంపిక ప్రక్రియలో మార్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో కొత్త జాబితాల రూపకల్పనపై స్పష్టత లేకపోవడంతో అధికారులు కూడా వేచి చూసే ధోరణిలో ఉన్నారు. రెండో విడత ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ప్రజాప్రతినిధులు, అధికారులు, కమిటీ సభ్యులను కలిసి తమ పేర్లు జాబితాలో ఉండేలా చూడాలని కోరుతున్నారు. ప్రభుత్వం త్వరగా స్పష్టత ఇచ్చి లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని అర్హులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇంటి కోసం ఆరు నెలలుగా ఎదురుచూపులు

**కవిత ఉషనగల్ల, రాయపోల్.**



ఉషనగల్ల కవిత (భర్త శ్రీనివాస్) ఇందిరమ్మ ఇంటి కోసం ఆరు నెలలుగా ఆశగా ఎదురుచూస్తున్నాను ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందనే నమ్మకంతో తమ పాత పెంకుటిల్లును కూల్చివేసి కొత్త ఇంటి నిర్మాణానికి సిద్ధమయ్యాను. అయితే ఇప్పటి వరకు ఇల్లు మంజూరు కాకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల జాబితాలో తమ పేరు వచ్చినట్లు అధికారులు తెలిపారు,ఇల్లు కూలగొట్టి తర్వాత ముగ్గు పోసే టైమ్ లో కారణాలు తెలియజేయకుండా జాబితా నుంచి తొలగించారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సొంతంగా పక్కా ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ప్రస్తుతం ఇబ్బందికర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన తమ కుటుంబాన్ని ప్రభుత్వం గుర్తించి ఇందిరమ్మ గృహ పథకం కింద ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని ఆమె

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- **అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం**

**ఆలేరు, జూన్ 24::**




జూన్ 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ఆలేరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గల మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యలు, మానసిక ఆరోగ్యంపై వాటి ప్రభావం, నివారణ చర్యలపై పాల్గొన్న వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆలేరు ఎస్‌హెచ్ఓ డి. యలాద్రి మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందన్నారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, హషిష్ ఆయిల్ వంటి మాదక పదార్థాలు వ్యక్తుల ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. డీఆర్‌డీఏ ఏపీఎం సత్యనారాయణ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు, యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్య, ఉపాధి, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని కోరారు.మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తామని, వ్యసన రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆలేరు పోలీస్ స్టేషన్ సిబ్బంది, గ్రామ మహిళా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**కరీం నగర్ జూన్24:.**

మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్–2026 అవార్డుల కోసం 5 నుంచి 18 సంవత్సరాల లోపు ప్రతిభావంతులైన బాలబాలికల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి తెలిపారు. ఆవిష్కరణ, సృజనాత్మకత, విద్య, సాంస్కృతికం, కళలు, సాహసం, క్రీడలు, సామాజిక సేవ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశేష ప్రతిభ కనబర్చిన వారు జూలై 31, 2026లోగా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు https://awards.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని, లేదా జిల్లా పరిషత్‌లోని బాల రక్ష భవన్, డీసీపీయూ కార్యాలయాన్ని 9490881098 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# డ్రగ్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా వినూత్న కార్యక్రమాలు

**యువత,విద్యార్థులు భారీగా పాల్గొనాలి :జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS**

**వికారాబాద్, జూన్,24:**



వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న “డ్రగ్స్ అవేర్‌నెస్ వీక్” కార్యక్రమాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోంది.ఈ కార్యక్రమాల్లో భాగంగా 25.06.2026 తేదీన వికారాబాద్ పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్ నందు డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా చాటిచెప్పే ఉద్దేశ్యంతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించబడుతుంది. ఈ టోర్నమెంట్‌లో పోలీస్ టీమ్, ప్రెస్ టీమ్, డాక్టర్స్ టీమ్, అడ్వకేట్స్ టీమ్, కలెక్టర్ కార్యాలయ టీమ్ మరియు మున్సిపల్ కార్యాలయ టీమ్‌లు పాల్గొంటాయి.అలాగే 26.06.2026 తేదీన బ్లాక్ గ్రౌండ్ నందు ఏరోబిక్స్, జుంబా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు 2K రన్ కూడా ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమాల ద్వారా యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన పెంపొందించడంతో పాటు డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా చైతన్యం కల్పించడం ప్రధాన లక్ష్యంగా ఉంది.కావున జిల్లా వ్యాప్తంగా ఉన్న యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS కోరారు.

# రైతులకు 100% సబ్సిడీపై కంది,పెసర విత్తనాలు పంపిణీ చేసిన ఏవో తులసి,






**దౌల్తాబాద్ మండలం, జూన్,24:**

కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలోని బాలంపేట గ్రామంలో రైతులకు 100 శాతం సబ్సిడీపై కంది, పెసర విత్తనాలను ఏవో తులసి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎల్ నీనో ప్రభావం ఉండడంతో రైతులు ఎక్కువ వర్షాధార పంటలను సాగు చేయకుండా తగిన మొత్తంలో సాగు చేయాలని రైతులకు సూచించారు.సాగుచేసిన పంట వివరాలను తప్పకుండా నమోదు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రమోదరావు, పి ఏ సి ఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, ఏఈఓ లోకేష్ మరియు రైతులు పాల్గొన్నారు.అనంతరం నందారం, ఇమిడాపూర్, ఈర్లపల్లి గ్రామాలలో రైతులకు 100 శాతం సబ్సిడీపై కంది, పెసర విత్తనాలను సంబంధిత గ్రామాల సర్పంచులు రైతులు ఆధ్వర్యంలో ఏవో తులసి, ఏఈవోలు లోకేష్, వైష్ణవి, శ్రీదేవి, వినోద్ లు పంపిణీ చేశారు.

# ఎక్క చెరువు తండాలో నూతన స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన...

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్**





**కొడంగల్ మండలం, జూన్,24:**

పాల్గురాళ్ళ తాండ గ్రామపంచాయతీ లోని ఏక్క చెరువు తండాలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి,మరియు కొడంగల్ ఇంచార్జి ఏ.తిరుపతి రెడ్డి సహకారంతో నూతన స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది.ఈ కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, వైస్ చైర్మన్ శంకర్ నాయక్, సర్పంచ్ విశ్లావత్ మోతిలాల్, మాజీ ఎంపిటిసి పాండు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుభాష్, వార్డ్ మెంబర్ రామ్ సింగ్. రాత్నిబాయ్ ఉపసర్పంచ్ బుజ్జిబాయి డీఈ సురేష్ బాబు రవి గౌడ్ రాంచందర్ రూప్లా నాయక్ గుండ్యానాయక్. హర్యా నాయక్ గమ్యా నాయక్ సునీల్ సేవ్య నాయక్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత పెన్నులు, పుస్తకాలు పంపిణీ కార్యక్రమం

**పాల్గొన్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి**



**పరిగి మండలం, జూన్ 24:**

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి.(పరిగి మండలం) లక్నపూర్ గ్రామంలో, పాల్ టెక్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు, పంపిణీ చేసిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవలని,ఉన్నతా స్థాయికి చేసుకోవాలని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి తెలిపారు.

# బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్, జూన్ 24:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల ఉత్సవాలను ఈ ఏడాది ఘనంగా నిర్వహించాలని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరిగే ఉత్సవాల ఏర్పాట్లపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బోనాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రత్యేక బస్సు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. గోల్కొండ, బాల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, సబ్జీమండి, అక్కన్న మాదన్న ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బోనాల పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే సాంస్కృతిక ఉత్సవమని పేర్కొంటూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

చురకలు



## సంగారెడ్డి: ఓటర్ల ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియపై అవగాహన




**సంగారెడ్డి జూన్24:**

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని 282 మంది బీఎల్ఏలు, ఇంచార్జ్‌లు పూర్తి సమయం కేటాయించి ఓటర్ల జాబితాల సవరణపై అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, జూలై 6న మరో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు నిర్మల, పార్లమెంట్ ఇంచార్జ్ ప్రీతం, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి, సాదా బైనామా దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల, జూన్ 24:**

భూ భారతి, సాదా బైనామా దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. భూ భారతి పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, రెవెన్యూ రికార్డులు, వారసత్వ హక్కుల నమోదు, సర్వే నంబర్ల వారీగా భూ వివరాలను ధృవీకరించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. సాదా బైనామా దరఖాస్తులను కూడా జాప్యం లేకుండా పరిశీలించి, సంబంధిత పత్రాలు, గ్రామ రెవెన్యూ రికార్డుల ఆధారంగా పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు, అన్ని మండలాల తహసీల్దార్లు సమావేశంలో పాల్గొన్నారు.

## ధర్మపురిలో రూ.10 కోట్ల డిగ్రీ కళాశాల



**జగిత్యాల జూన్24:.**

జగిత్యాల జిల్లా ధర్మపురిలో HAL సంస్థ తన CSR నిధుల కింద రూ.10 కోట్ల వ్యయంతో నూతన డిగ్రీ కళాశాల భవనాన్ని నిర్మించనుంది. ఈ మేరకు తెలంగాణ సచివాలయంలో HAL ప్రతినిధులు, జిల్లా యంత్రాంగం మధ్య ఎంఓయూ కుదిరింది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా ధర్మపురి, వెల్గటూరు, పెగడపల్లి, గొల్లపల్లి మండలాల విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు మెరుగుపడనున్నాయి. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందు బాటులోకి రావడంతో పాటు ఆధునిక సదుపాయాలతో కళాశాల నిర్మాణం చేపట్ట నున్నారు

## సెప్టెంబర్ 2027 నాటికి గోదావరి ఫేజ్-II, III పనులు పూర్తి చేయాలి

**జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**



**హైదరాబాద్ జూన్ 24:.**

హైదరాబాద్ భవిష్యత్ తాగునీటి అవసరాల కోసం చేపడుతున్న గోదావరి తాగునీటి సరఫరా ప్రాజెక్టు ఫేజ్–II, III పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. మల్లన్నసాగర్ పంప్ హౌస్, 3000 మిల్లీమీటర్ల ప్రధాన పైప్‌లైన్ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, సెప్టెంబర్–2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులు, నిర్మాణ సంస్థలకు ఆదేశించారు. పనుల వేగవంతానికి అదనపు సిబ్బంది, యంత్రాలు ఏర్పాటు చేయాలని సూచించడంతో పాటు, కార్మికుల భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

# సమన్వయంతో పనిచేసి బాధితులకు న్యాయం అందించాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS
- భరోసా కేంద్రం సేవలను మరింత సమర్ధవంతంగా అందించేందుకు అన్ని శాఖల సమన్వయం అవసరం
- మహిళలు, చిన్నారుల రక్షణలో భాగస్వామ్య శాఖల పాత్ర కీలకం




**నారాయణపేట,జూన్ 24:**

నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో భరోసా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS పాల్గొని మాట్లాడారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న హింస, వేధింపులు, లైంగిక దాడులు మరియు ఇతర నేరాల బాధితులకు తక్షణ సహాయం, రక్షణ, పునరావాసం, కౌన్సెలింగ్ మరియు న్యాయ సహాయం అందించడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. బాధిత మహిళలు మరియు చిన్నారులకు అందిస్తున్న సేవలను మరింత బలోపేతం చేయడం సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం,బాధితులకు సమగ్ర సేవలు అందించడం ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు.బాధిత మహిళలకు చిన్నారులకు తక్షణ సహాయం చేయడంలో సంబంధిత శాఖలకు ఎలాంటి సమస్యలు వస్తున్నాయా అడిగి తెలుసుకుని వారికి పలు సూచనలు చేశారు. భరోసా సెంటర్ కి వచ్చిన బాధితులకు మెడికల్, లీగల్, CWC అధికారుల దగ్గర కు పంపించకుండా వారి వద్దకే అందరూ వచ్చి న్యాయం చేసే విధంగా చూడాలని తెలిపారు. అలాగే వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి అందులో సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. అలాగే ప్రతి నెల రివ్యూ మీటింగ్ నిర్వహించి ఆ నెలలో ఎంతమంది బాధితులకు న్యాయం అందించడంలో ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి,వారికి అందించే ప్రభుత్వ పరిహారం తదితర విషయాలు గురించి చర్చించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... దర్యాప్తు ప్రక్రియలో పోలీసు శాఖతో పాటు మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా న్యాయ సేవల సంస్థ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్‌లైన్, కౌన్సిలర్లు మరియు ఇతర భాగస్వామ్య సంస్థలు సమిష్టిగా పనిచేస్తే బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని పేర్కొన్నారు.బాధితుల కేసుల పరిష్కారంలో జాప్యం జరగకుండా ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించాలని, ముఖ్యంగా చిన్నారులకు సంబంధించిన కేసుల్లో అత్యంత సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. బాధితుల పునరావాసం, విద్య, వైద్య సహాయం, మానసిక ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.భరోసా కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు బాధితులు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయగల వాతావరణాన్ని కల్పించాలని ఎస్పీ పేర్కొన్నారు.

# రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

**డి.ఎస్. లోకేష్ కుమార్**




**పెద్దపల్లి, జూన్ 24::.**

రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డితో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ భారతి, ప్రజావాణి, రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మీ సేవ ద్వారా దరఖాస్తు చేసిన కులం, ఆదాయం, నివాస ధ్రువపత్రాలను 30 రోజుల్లోగా జారీ చేయాలని, 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తులన్నింటినీ జూలై 10లోగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను జూలై 5లోగా పరిష్కరించాలని తహసీల్దార్లకు ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, నాణ్యమైన రెవెన్యూ సేవలు అందించాలని సూచించారు.

# వీధి వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

**కరీంనగర్, జూన్ 24:.**



వీధి వ్యాపారుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. వ్యాపారుల సమస్యల పరిష్కారం, అభివృద్ధి అవకాశాలపై త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ కళాభారతిలో నిర్వహించిన స్వనిధి మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని వీధి వ్యాపారులకు సూచించారు. రుణాలను సమర్ధవంతంగా వినియోగించుకుని జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని కోరారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ పీఎం స్వనిధి పథకం ద్వారా లభిస్తున్న అవకాశాలను వినియోగించుకుని వ్యాపారులు ఆర్థికంగా బలోపేతం కావాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఈ పథకం అమలులో ముందంజలో ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీఎం స్వనిధి పథకం కింద రూ.50 లక్షల విలువైన రుణాల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పలువురు వీధి వ్యాపారులను సన్మానించారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మెప్మా పీడీ స్వరూప రాణి, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

# కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధిపై సమావేశం

**జిల్లా వైద్యా ఆధికారి డాక్టర్. సుధాకర్ లాల్**





**కొడంగల్ మున్సిపల్, జూన్,24:**

కొడంగల్ మండలములో ముందస్తు క్యాన్సర్ నిర్ధారణ తెలుసుకోవడానికి ముంబై క్యాన్సర్ ఇన్స్టిట్యూషన్ నుండి NGO's Team, డాక్టర్ సుధాకర్ లాల్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, తో కలిసి కొడంగల్ హాస్పిటల్ లో సమావేశం పెట్టుకొని కొడంగల్ మండలం లో కొన్ని గ్రామాలను ఎంచుకొని ఆశ లతో కలసి ఇంటి ఇంటి సర్వే చేసి క్యాన్సర్ కేస్ లను గుర్తిస్తారు.అలాగే కొడంగల్ మున్సిపల్ లో మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ను అంగడి రాయచూరు సర్పంచ్ సౌభాగ్య లక్ష్మి నీ కలిసి ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరడం జరిగింది, ముందస్తు క్యాన్సర్ రాకుండా HPV వ్యాక్సిన్ 14 , 15 years అమ్మాయిలు తీసుకోవాలని, అలాగే

ఈ నెల 28 కి పల్స్ పోలియో కార్యక్రమము ఉందని 0–5 years పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించుకోమని చెప్పడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో వైద్యులు డాక్టర్. రవీంద్ర యాదవ్ (ఆసుపత్రి ఆర్ ఎం ఓ),డాక్టర్. బుష్రా ఫాతిమా, డాక్టర్. సాకేత్,డాక్టర్. దివ్య హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్ రెడ్డి, ఉన్నారు.

# ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి

**BLAలకు ప్రత్యేక శిక్షణలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య**




**ఆలేరు, జూన్ 24::**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కీలక పాత్ర పోషించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆలేరు పట్టణంలో నిర్వహించిన బీఎల్ఏల ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు కావడం, అనర్హుల పేర్ల తొలగింపు, వ్యక్తిగత వివరాల సవరణ వంటి అంశాలపై బీఎల్ఏలకు సమగ్ర అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా పకడ్బందీగా ఉండేలా ప్రతి బూత్ స్థాయిలో క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. విద్యార్థుల సమస్యలను దేశవ్యాప్తంగా ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో చాత్రింకి గుంజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీబీఎస్ఈ పరీక్షల మూల్యాంకనంలో జరిగిన లోపాల వల్ల అనేక మంది విద్యార్థులు తీవ్ర నిరాశకు గురయ్యారని, కొందరు ప్రాణాలు కోల్పోయే స్థితికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు న్యాయం జరగాలంటే పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత ఉండాలని, పేపర్ లీకేజీలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 26న యాదగిరిగుట్ట పట్టణంలోని మున్నూరు కాపు చాత్రంలో నిర్వహించే చాత్రింకి గుంజ్ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన కుటుంబాలు సమాజ నిర్మాణమే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.**

**నారాయణపేట, జూన్,24:**



మాతృ మరణాలు (MMR), శిశు మరణాల(IMR)ను తగ్గించి ఆరోగ్యకరమైన కుటుంబాలు సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు.బుధవారం సాయంత్రం నారాయణ పేట మండలంలోని అప్పక్ పల్లి వద్ద గల ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి (GGH) లో సంకల్ప్ (SANKALP - Systematic Action for Nurturing and Care of Life Programme) పై ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువులు మరియు చిన్నారుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సమగ్ర కార్యక్రమమే సంకల్ప్ అని తెలిపారు.గర్భిణీలకు నాణ్యమైన ప్రసూతి సేవలు అందించడం, అధిక ప్రమాద గర్భిణీలను (High Risk Pregnancies) ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్యం అందించడం, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడం, ప్రభుత్వ ఆరోగ్య సంస్థలలో ప్రసవాలను ప్రోత్సహించడం సంకల్ప్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం అని ఆమె పేర్కొన్నారు.అలాగే గర్భిణీల నమోదు, క్రమం తప్పకుండా ఏ ఎన్ సీ పరీక్షలు నిర్వహించాలన్నారు. రక్తహీనత, రక్తపోటు, మధుమేహం వంటి సమస్యల గుర్తించి అవసరమైన చికిత్సలు చేయాలన్నారు. ప్రసవానికి ముందస్తు ప్రణాళిక, సురక్షిత ప్రసవ సేవలు అందించి ప్రసవానంతర తల్లి శిశువు సంరక్షణ,టీకాలు, పోషకాహారం మరియు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. తద్వారా తల్లి, శిశువుల ఆరోగ్య సూచికల్లో మెరుగుదల,అధిక ప్రమాద గర్భిణీలకు సకాలంలో చికిత్సతో మాతృ,శిశు మరణాల తగ్గింపు సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ సింగ్, జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ మల్లికార్జున్, జిల్లా ఆస్పత్రి వైద్య నిపుణుల బృందం పాల్గొన్నారు.

# గండీడ్‌లో కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీలు

**గుండెడ్ జూన్ 24:.**

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమతి లేకుండా గైర్హాజరైన మహమ్మదాబాద్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి తరగతుల్లోనే బోధన నిర్వహించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యా బోధన, అల్పాహారం నాణ్యత, హాస్టల్ సౌకర్యాలు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. నిర్మాణంలో ఉన్న కేజీబీవీ నూతన భవన పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం గండీడ్ పీహెచ్‌సీని తనిఖీ చేసి ఓపీ నమోదు, మందుల లభ్యత, గర్భిణీలకు అందుతున్న వైద్య సేవలను సమీక్షించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు.



# నిరుపయోగంగా ఉన్న ఉర్దూ ఘర్, షాదీ ఖానాలను వాడుకలోకి తీసుకురావడానికి సన్నాహాలు

**తెలంగాణ ఉర్దూ అకాడమీ అధ్యక్షులు తహేర్ బిన్ హందాన్**

**వికారాబాద్, జూన్,24:**



వికారాబాద్: నిరుపయోగంగా ఉన్న ఉర్దూ ఘర్, షాది ఖానాలను వాడుకలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలంగాణ ఉర్దూ అకాడమీ అధ్యక్షులు తహేర్ బిన్ హందాన్ తెలిపారు. బుధవారం ఉర్దూ అకాడమీ అధ్యక్షులు వికారాబాద్ ఎన్ని పల్లి చౌరస్తాలో గల ఉర్దూ ఘర్ కం షాదీఖానా భవనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిరుపయోగంగా ఉన్న ఇట్టి భవనాలను వాడుకల్లోకి తీసుకురావడానికి మరమ్మత్తు పనులు చేపట్టేందుకు జగన్ తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకునే అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సిటిసి ద్వారా నిరుద్యోగ యువతకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం జరిగిందని, ఇలాంటి కార్యక్రమాలను చేపట్టేందుకు నిరుపయోగంగా ఉన్న ఉర్దూ ఘర్ లను గుర్తించడం జరుగుతుందని ఆయన తెలిపారు.జిల్లాలో అవసరమైన ప్రాంతాల్లో ఉర్దూ ఘర్, షాదిఖానాల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.ముందుగా ఉర్దూఘర్ పరిసర ప్రాంతాలను పరిశీలించి భవన మరమ్మత్తు పనులు చేపట్టి కంప్యూటర్ శిక్షణ, గ్రంథాలయ నిర్వహణకు వినియోగించుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.ఉర్దూ అకాడమీ అధ్యక్షులతో పాటు సహాయ సంచాలకులు వి. కృష్ణ, జడ్పీ సీఈఓ, ఇన్చార్జ్ డిఎండబ్ల్యూఓ సుధీర్, సిబ్బంది ఉన్నారు.

# జైనూర్‌లో రూ.1.25 కోట్ల మార్కెట్ కమిటీ భవనాల ప్రారంభం

**జైనూర్ జూన్24:.**

ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో రూ.1.25 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ భవనాల సముదాయాన్ని జిల్లా కలెక్టర్ కె. హరిత, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి , వెడ్మ బొజ్జు పటేల్ ల తో కలసి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నూతన భవనాల నిర్మాణంతో మార్కెట్ కమిటీకి స్థిరమైన ఆదాయం సమకూరుతుందని తెలిపారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా అసలు రసీదులు తీసుకుని భద్రపరచుకోవాలని, నకిలీ విత్తనాల నియంత్రణకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మంకీ రెస్క్యూ సెంటర్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



**సారంగాపూర్ జూన్24:.**

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ధవారం సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామ గ్రామంలోని గండిరామన్న హరితవనంలో గల మంకీ రెస్క్యూ సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోతుల పట్టివేతకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పట్టుకున్న కోతులు, పునరావాసం, అందుబాటులో ఉన్న మంకీ క్యాచర్స్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో 50 ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రోత్సాహం



**మహబూబాబాద్ జూన్24:**

మహబూబాబాద్ జిల్లాలో స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రతి గ్రామంలో 50 ఎకరాల్లో కూరగాయలు, ఆయిల్ పామ్, పండ్ల తోటలు, మునగ, మల్బరీ, తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కురవి వీరభద్ర మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులకు నిర్వహించిన సమావేశంలో ఆధునిక సాగు పద్ధతులు, పంట మార్పిడి, షేడ్‌నెట్ సాగు, ట్రెల్లిస్ విధానం, బిందు సేద్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కూరగాయల సాగుకు అంతర పంటల రాయితీలు, శాశ్వత పందిరి నిర్మాణానికి రూ.లక్ష వరకు సబ్సిడీ, నారు మొక్కల సరఫరా వంటి ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు ఎకరానికి రూ.లక్ష వరకు నికర ఆదాయం పొందేలా ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని అధికారులు పిలుపునిచ్చారు.



# ఎన్ఆర్ఈజీఎస్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష

**మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**



**మహబూబ్ నగర్ జూన్ 24:.**

ఎన్ఆర్ఈజీఎస్ పనుల పురోగతిపై ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి 100 శాతం గ్రౌండింగ్ సాధించాలని, లబ్ధిదారుల 90 రోజుల ఉపాధి హామీ మస్టర్ రోల్స్‌ను నెలాఖరులోగా నవీకరించాలని ఆదేశించారు. హరితహారం లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని సూచించారు. గ్రామాల్లో చెత్తను రోడ్ల పక్కన వేయకుండా డంపింగ్ యార్డుల్లోనే నిర్వహించాలని, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సంఘ భవనాలు, గోదాముల పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# రిమ్స్ లో మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్ రాజర్షి షా



**అదిలాబాద్ జూన్24:**

ఆదిలాబాద్ రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈఎన్‌టీ, యూరాలజీ, డ్రగ్స్, ఈసీజీ విభాగాలను పరిశీలించి రోగులతో నేరుగా మాట్లాడి సేవలపై ఆరా తీశారు. రిమ్స్‌లో న్యూరో సర్జరీ, యూరాలజీ, సైకియాట్రీ, ఈఎన్‌టీ వంటి ప్రత్యేక వైద్య సేవలు ఉచితంగా అందుతున్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లాలో మెరుగైన వైద్య సేవల కోసం నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు**



**అదిలాబాద్ జూన్24:.**

ఆదిలాబాద్ జిల్లాలో 99 రోజుల 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం విజయవంతంగా అమలైందని జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. కార్యక్రమం ముగిసినప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఇదే స్ఫూర్తితో నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. గ్రామసభలు, మండల సమావేశాల్లో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని, సీఎం హామీలు, అభివృద్ధి పనుల అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను అధికారులు తరచూ సందర్శించి పరిశుభ్రత, ఆహార నాణ్యతను పరిశీలించాలని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ, పారిశుధ్యం, ఆరోగ్యం, ఫైళ్ల పరిష్కారం, ఉపాధి కల్పన, సంక్షేమ కార్యక్రమాల్లో జిల్లా విశేష పురోగతి సాధించిందన్నారు. ముఖ్యమంత్రి హామీలు, సంక్షేమ లబ్ధి, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలతో కూడిన ★"సమగ్ర ప్రగతి నివేదిక"★ను త్వరలో ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక బుక్‌లెట్‌ను ప్రత్యేక అధికారి ఆవిష్కరించారు.

# తినుబండారాల దుకాణదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత**

**నిర్మల్, జూన్ 24::**

పట్టణంలోని పలు మిఠాయి దుకాణాలను జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి టి. సునీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలలో గడువు ముగిసిన మిఠాయిలు, చాక్లెట్లు, లేబుళ్లు లేని ఆహార పదార్థాలను గుర్తించారు.నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలపై తగు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆహార పదార్థాలపై లేబుళ్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని, గడువు ముగిసిన వస్తువులను వెంటనే తొలగించాలని దుకాణదారులకు సూచించారు.

## భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు: కలెక్టర్ కుమార్ దీపక్

**నెన్నెల జూన్24:.**

మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం పుప్పల్వానిపేటలో నిర్వహించిన భూ సర్వే అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. పట్టాదారులు సరైన పత్రాలతో సర్వేలో పాల్గొనాలని, బోగస్ దరఖాస్తులను రద్దు చేసి వివాదాస్పద భూములను న్యాయబద్ధంగా పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం నెన్నెల తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అధి కారులకు సూచించారు. అలాగే కొన్నంపేట ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

## అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**మంచిర్యాల జూన్24:..**

2026–27 విద్యా సంవత్సరానికి కరీంనగర్ ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన అంధ బాలబాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్ జిల్లాల విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుంది. పాఠశాలలో ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, పాదరక్షలు, వసతి సౌకర్యం కల్పించబడుతుంది. సదరం/యూడీఐడీ ధ్రువపత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్, టీసీ, రెండు ఫోటోలతో కరీంనగర్ విజయపురి కాలనీలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలి. వివరాలకు 9701190127, 9440338424 నంబర్లను సంప్రదించవచ్చు.

## ఎస్సీ న్యాయశాస్త్ర పట్టభద్రులకు దరఖాస్తుల ఆహ్వానం

**మంచిర్యాల జూన్24(సమయ్యం న్యూస్).**

మంచిర్యాల జిల్లాలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన న్యాయశాస్త్ర పట్టభద్రులు శిక్షణ భృతి, న్యాయ గ్రంథాలు, ఫర్నిచర్ సహాయం కోసం జూలై 31 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ తెలిపారు. 39 ఏళ్లలోపు అర్హులైన అభ్యర్థులకు మూడు సంవత్సరాల పాటు న్యాయ పరిపాలనలో శిక్షణతో పాటు నెలకు రూ.3,000 భృతి, ఒకేసారి రూ.50,000 ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు ఈ–పాస్ వెబ్‌సైట్ ద్వారా సమర్పించాల్సి ఉండగా, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు జత చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయాన్ని సంప్ర దించవచ్చని తెలిపారు.

## కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాల, తరగతి గదులను ప్రారంభించిన ఎంపీ డికే అరుణ





**మద్దూరు మండలం, జూన్,24**

నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని పెదిరిపహడ్ గ్రామంలో 2.30 కోట్ల సమగ్ర శిక్ష నిధులతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల, అదనపు తరగతి గదులను ఎంపీ డీకే అరుణ బుధవారం కొడంగల్ ఇంచార్జి ఏ.తిరుపతి రెడ్డి,కాడ అధికారి వెంకట్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు.అనంతరం కస్తూర్బా కళాశాల విద్యార్థినులతో ఎంపీ డీకే అరుణ ముచ్చటిస్తూ ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్,కొడంగల్ ఇంచార్జి ఏ.తిరుపతి రెడ్డి, డీ ఈ ఓ గోవింద రాజులు, ఆ పాఠశాల ఎస్.వో. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## బోనకల్ మండలంలో రూ.17.48 కోట్ల రోడ్డు పనులకు శంఖుస్థాపన

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ఖమ్మం, జూన్ 24::.**

మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలంలో పలు రహదారి, మౌలిక వసతుల అభివృద్ధి పనులకు రాష్ట్ర డిప్యూటీ సీఎం Bhatti Vikramarka Mallu బుధవారం శంఖుస్థాపనలు చేశారు. చిరునోముల–వత్సవాయి రహదారి, ముష్టికుంట ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ముష్టికుంట–నాగులవంచ–చొప్పకట్లపాలెం రహదారి, ముష్టికుంట–గార్లపాడు రహదారి, బోనకల్ ఆర్‌అండ్‌బీ రోడ్డు–చిరునోముల రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారులు, మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ ప్రాధాన్యమని తెలిపారు. గ్రామీణ రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా రైతులు, విద్యార్థులు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఈ రహదారి పనుల కోసం సుమారు రూ.17.48 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కు దూరంగా ఉండాలి

### యాలల ఎస్సై విఠల్ రెడ్డి

**యాలల మండలం,జూన్,24:**



డ్రగ్స్ రహిత తెలంగాణ మనందరి ధ్యేయం కావాలనే ఉద్దేశం లో భాగంగా బుధవారం యాలాల మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో యాలాల పోలీసులు బాలబాలికలకు వ్యాసరచన, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు యాలాల ఎస్సై విఠల్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ కు దూరంగా ఉండాలని మన తోటి వారు కూడా డ్రగ్స్ భూతానికి అలవాటు పడకుండా చూసుకోవాలని డ్రగ్స్ వల్ల ఆరోగ్యం పాడవుతుందని కుటుంబాలు వీధిన పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్రామేశ్వర్, రవీందర్ రెడ్డి, పీడీ రాజశేఖర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఏ.ఎస్సై. రామచందర్, హెడ్ కాన్స్టేబుల్ నర్సిములు, జగదీష్, విమెన్ పీసీ అనురాధ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సవరణ కార్యక్రమం (SIR)-2026

## ఓటరు చైతన్యానికి 2కే రన్ నిర్వహణ

**నారాయణపేట,జూన్,24:**




రాష్ట్ర మరియు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సవరణ కార్యక్రమం (SIR)–2026లో భాగంగా ఓటరు చైతన్యాన్ని పెంపొందించేందుకు 2కే రన్ కార్యక్రమాన్ని 25వ తేదీ గురువారం ఉదయం 7.00 గంటలకు నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించ నున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు.ఈ 2కే రన్ కలెక్టరేట్ నుండి కొనసాగుతుందని ఇందులో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, ఓటరు నమోదు, ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాల్సిన అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. విద్యార్థులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు మరియు సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.కార్యక్రమ సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా సామాజిక మాధ్యమాలు, ప్రజా ప్రకటనలు మరియు ఇతర సమాచార మార్గాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించబడుతోందన్నారు. అందరు ఉదయం 7.00 గంటలకు జిల్లా కలెక్టరేట్ చేరుకోవాలని సూచించారు...

## సత్తుపల్లిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు




**సత్తుపల్లి జూన్24:**

ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ K. T. Rama Rao కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో రైతులు, విద్యార్థులు, విలేకరులు సహా అన్ని వర్గాలు నష్టపోయాయని ఆరోపించారు. రైతుబంధు, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 వేల కోట్లతో ముందుకు తీసుకెళ్లిందని, తిరిగి అధికా రంలోకి వస్తే ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రుల చేతిలో కీలక శాఖలు ఉన్నప్పటికీ జిల్లాకు ప్రయోజనం చేకూర లేదని పేర్కొన్నారు. యూరియా కొరత, గన్నీ బ్యాగుల సమస్య, రైతు సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో అవినీతి, భూకుంభకోణాలు పెరిగాయని ఆరోపించిన కేటీఆర్, ప్రజల ఆశీర్వాదంతో K. Chandrashekar Rao మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకె ళ్లాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగి పోకుండా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## అబ్దుల్ ముఖీత్ చందాను ప్రశంసించిన కేటీఆర్



**హైదరాబాద్, జూన్ 24:**

తన కుమారుడి వివాహ వేడుకల్లో అనవసర ఖర్చులను తగ్గించి, ఆ మొత్తంలో రూ.50 లక్షలను అనాథలు, ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థుల విద్య కోసం విరాళంగా అందించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అబ్దుల్ ముఖీత్ చందాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి రామారావు అభినం దించారు. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న అనాథ, పేద విద్యార్థులకు విద్యా సహాయం అందించనున్నట్లు తెలిపారు. సర్ సయ్యద్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి పలు విద్యాసంస్థలు 50 శాతం ట్యూషన్ ఫీజు రాయితీ ప్రకటించడం వల్ల మరింత మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారని పేర్కొన్నారు. వ్యక్తిగత వేడుకను విద్యార్థుల భవిష్యత్తుకు అంకితం చేయడం గొప్ప సామాజిక బాధ్యతగా కేటీఆర్ కొనియాడారు. పెళ్లిళ్లలో ఆడంబరాలకు బదులుగా విద్యకు ప్రాధాన్యం ఇవ్వడం సమాజానికి ఆదర్శమని అన్నారు. విద్యే వ్యక్తుల సాధికారతకు, సమాజ మార్పుకు అత్యంత శక్తివంతమైన సాధనమని పేర్కొన్న కేటీఆర్, 'గిఫ్ట్ ఏ స్మైల్' వంటి కార్యక్రమాలు పేద కుటుంబాల్లో ఆశలు నింపుతాయని చెప్పారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

# కరీంనగర్‌లో కారు గుర్తు సునామీ ఖాయం:కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 24::.**



కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్‌కు అనాదిగా కోటలాంటిదని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా జిల్లాలో కారు గుర్తుదే విజయం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) అన్నారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హైదరాబాద్ నివాసంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని పార్టీ బలోపేతం, సమకాలీన రాజకీయాలపై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రజలు తిరిగి బీఆర్ఎస్, కేసీఆర్ నాయకత్వం వైపు చూస్తున్నారని అన్నారు. పార్టీ అంతర్గత సర్వే ప్రకారం కరీంనగర్ జిల్లాలో కారు గుర్తు మరోసారి సునామీ సృష్టించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. సింగరేణి అంశంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి కుట్రలు చేస్తున్నాయని ఆరోపించిన కేటీఆర్, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు. అలాగే బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని, కార్యకర్తలతో నిరంతరం అనుసంధానం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యతను ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్న కేటీఆర్, ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ రైతులకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. సామాజిక మాధ్యమాలను సమర్థంగా వినియోగించి ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు.



# నిబద్ధతకు నిలువెత్తు రూపం

# వీపీ సింగ్

## అవినీతిపై పోరాడి అధికారాన్ని త్యజించిన అరుదైన ప్రధానమంత్రి

భారత రాజకీయ చరిత్రలో విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ పేరు ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోయింది. అధికారం కోసం సిద్ధాంతాలను తాకట్టు పెట్టని నాయకుడిగా, అవినీతిపై రాజీపడని రాజకీయవేత్తగా, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన ప్రధానమంత్రిగా ఆయనకు చిరస్థాయి గుర్తింపు లభించింది. ప్రధానమంత్రి పదవిని అధిష్టించినా, అంతకంటే ముందే అవినీతి వ్యతిరేక పోరాట యోధుడిగా దేశవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన నాయకుడు వీపీ సింగ్. 1931 జూన్ 25న ఉత్తరప్రదేశ్‌లోని మండా రాజవంశ కుటుంబంలో జన్మించిన విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ విద్యాభ్యాసాన్ని డెహ్రాడూన్, అలహాబాద్, పూణే విద్యాసంస్థల్లో పూర్తి చేశారు. 1969లో ఉత్తరప్రదేశ్ శాసనసభ సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన, 1971లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. అనంతరం ఇందిరాగాంధీ మంత్రివర్గంలో వాణిజ్య శాఖ ఉపమంత్రిగా, తర్వాత కేంద్ర మంత్రిగా పనిచేశారు.

1980లో ఇందిరాగాంధీ ఆయనను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా నియమించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, పరిపాలనా సంస్కరణల విషయంలో ఆయన తీసుకున్న చర్యలు విశేష గుర్తింపు తెచ్చాయి. అనంతరం కేంద్రంలో వాణిజ్యశాఖ మంత్రిగా, ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో పన్ను ఎగవేతదారులపై, అక్రమ సంపద కూడబెట్టిన పారిశ్రామికవేత్తలపై దాడులు నిర్వహించి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యారు. అధికార పార్టీకి ఆర్థికంగా అండగా ఉన్న పెద్ద పారిశ్రామికవేత్తలపై కూడా చర్యలు తీసుకోవడంతో ఆయన నిజాయితీ రాజకీయాలకు నిదర్శనంగా నిలిచారు. 1987లో రక్షణ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వీపీ సింగ్, బోఫోర్స్ తుపాకుల కొనుగోలు ఒప్పందంలో జరిగిన అవకతవకలపై దృష్టి సారించారు. స్వీడన్‌కు చెందిన బోఫోర్స్ సంస్థతో కుదిరిన ఒప్పందంలో భారీ కమీషన్లు చెల్లించారన్న ఆరోపణలను వెలుగులోకి తీసుకువచ్చారు. ఈ వ్యవహారం అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ప్రభుత్వాన్ని తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. దర్యాప్తుపై విభేదాల నేపథ్యంలో వీపీ సింగ్ కేంద్ర మంత్రివర్గానికి రాజీనామా చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి, లోక్‌సభ సభ్యత్వానికీ రాజీనామా చేసి అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీని వీడిన తర్వాత అరుణ్ నెహ్రూ, అరిఫ్ మహ్మద్ ఖాన్‌లతో కలిసి జనమోర్చా స్థాపించారు. అనంతరం జనతాపార్టీ, లోక్‌దళ్, కాంగ్రెస్ (ఎస్) వంటి పార్టీలను ఏకం చేసి జనతాదళ్‌ను ఏర్పాటు చేశారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు అధ్యక్షుడిగా, వీపీ సింగ్ కన్వీనర్‌గా నేషనల్ ఫ్రంట్ కూటమి ఏర్పడింది. ప్రాంతీయ పార్టీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి జాతీయ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలికారు.

1989 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించిన వీపీ సింగ్, 1989 డిసెంబర్ 2న భారతదేశ ఏడవ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. భారతీయ జనతా పార్టీ, వామపక్షాల బాహ్య మద్దతుతో ఏర్పడిన ఆయన ప్రభుత్వం కేవలం 11 నెలలు మాత్రమే కొనసాగినప్పటికీ, భారత రాజకీయాలపై చెరగని ముద్ర వేసింది. వీపీ సింగ్ ప్రధానమంత్రి హోదాలో తీసుకున్న అత్యంత కీలక నిర్ణయం మండల్ కమిషన్ సిఫారసుల అమలు. 1979లో ఏర్పడిన మండల్ కమిషన్ నివేదిక దాదాపు దశాబ్దకాలం పాటు అమలు కాకుండా ఉండిపోయింది. 1990 ఆగస్టులో ఆ నివేదికను అమలు చేస్తూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇతర వెనుకబడిన వర్గాలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం భారత సామాజిక, రాజకీయ చరిత్రలో మలుపుతిప్పిన ఘట్టంగా నిలిచింది. ఒకవైపు దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమైనా, మరోవైపు సామాజిక న్యాయం కోసం ఆయన తీసుకున్న ధైర్య నిర్ణయంగా ఇది చరిత్రలో నిలిచిపోయింది. అనంతరం సుప్రీంకోర్టు కూడా ఓబీసీ రిజర్వేషన్లను సమర్థించింది. ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో శ్రీలంకలో భారత శాంతి బలగాల వ్యవహారంపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పాకిస్థాన్ నుంచి వచ్చిన భద్రతా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. దేశ ప్రయోజనాల విషయంలో రాజీపడని నాయకుడిగా గుర్తింపు పొందారు. అధికారాన్ని కంటే విలువలను గొప్పగా భావించిన నాయకుల్లో వీపీ సింగ్ ఒకరు. అవినీతిపై పోరాడటానికి మంత్రి పదవిని వదులుకున్న అరుదైన రాజకీయవేత్తగా ఆయన నిలిచారు. అధికారాన్ని సాధించడం కంటే ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికే ప్రాధాన్యం ఇచ్చారు. 2008 నవంబర్ 27న ఆయన కన్నుమూసినా, అవినీతి వ్యతిరేక పోరాటం, సామాజిక న్యాయం, నిబద్ధతతో కూడిన రాజకీయాలకు ప్రతీకగా ఆయన పేరు నేటికీ గుర్తు చేసుకుంటూనే ఉన్నారు. భారత రాజకీయాల్లో అధికారాన్ని ప్రశ్నించిన నాయకులు ఎందరో ఉన్నా... అధికారాన్నే త్యాగం చేసి సిద్ధాంతాలకు కట్టుబడిన నాయకుల జాబితాలో విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ పేరు ఎప్పటికీ ముందువరుసలోనే ఉంటుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# అవయవదానాలపై అవగాహన అవసరం

## నేడు ప్రపంచ అవయవదాన మార్పిడి దినోత్సవం



సమకాలీన వైద్యశాస్త్రం సాధించిన అద్భుతమైన ఆవిష్కరణ అవయవ మార్పిడి పద్ధతి. అవయవ మార్పిడి ద్వారా దాతల శరీరం నుంచి సేకరించిన అవయవాలను అవయవ లోపాలతో బాధపడుతున్న రోగులకు అమర్చి, వారికి స్వస్థత కలిగించే విధానం నానాటికీ పురోగతి సాధిస్తున్నది. అవయవ దాతల సంఖ్య కూడా అవసరాలకు తగినంతగా కాకపోయినా, నెమ్మదిగా అధికం అవుతున్నది. అన్ని దానాల కన్నా అవయవ దానం గొప్పదనే నగ్న సత్యాన్ని దాతలు అర్థం చేసుకుంటున్నారు.

### మానవుడు మృతి చెందాకే

శరీరం నుంచి అవయవాలు సేకరిస్తారు కనుక, చనిపోయాక కూడా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపే సదావకాశాన్ని అవయవదానం కల్పిస్తు న్నదన్న వాస్తవం గురించి అవగాహన దాతలకు ఏర్పడుతున్నది. దాతల మరణంతో వారి వారి శరీరాలతో పాటే శరీర అవ-యవాలు కనుమరుగు కాకుండా, వారి అవయవాలు ఇతరులకు ఉపయోగ పడడంలో, అంతకు మించిన తృప్తి మరొకటి ఉండదు. ఈ పరమ సత్యాన్ని గ్రహించి, ప్రస్తుతం ఎందరో తమ అవయవాలకు దానం చేయడానికి ముందుకొస్తున్నారు. ఈ అవగాహన పెంచేందుకే జూన్ 25న ప్రపంచ అవయవదాన మార్పిడి దినోత్సవం జరుపుకొంటారు. అవయవ మార్పిడితో ఎవ్వరైనా కొత్త జీవితాన్ని తిరిగి పొందే అవకాశం ఉంటుంది. మరణించిన వ్యక్తి జీవితం అక్కడితో ఆగకుండా, మరణించిన వ్యక్తి మరికొంత మందికి ప్రాణమిచ్చి జీవిస్తూనే ఉన్నాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులకు అవయవ దానాలను అమర్చి వారి ప్రాణాలను కాపాడు తున్నారు. అవయవ మార్పిడి వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడటం సాధ్యం అవుతుంది.

కళ్లు, మూత్ర పిండాలు, ఊపిరి తిత్తులు, చర్మం, ఎముక, గుండె కవాటాలు, కార్నియా, సిరలు ఇలా ఎన్నో అవయవ దానాల వల్ల మార్పిడి చేయవచ్చు. బ్రెయిన్‌డెడ్ అయ్యేవారి శరీరాలను వెంటనే దానం చేస్తే ఇతరులకు అమర్చవచ్చు. ఒక్కదాతతో 8 మంది ప్రాణాలను రక్షించవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం 5 లక్షలకుపైగా ప్రజలు వారి ముఖ్య అవయవాల వైఫల్యం కారణంగా మరణిస్తున్నట్లు ఓ నివేదిక తెలుపుతున్నది. కాలేయ వ్యాధి కారణంగా 2లక్షల మంది మ-రణిస్తున్నారు. గుండె జబ్బుల కారణంగా 50,000 మంది గుండెలు ఆగి పోతున్నాయి. అంతే కాకుండా, 1.5లక్షల మంది కిడ్నీ మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారు, కాని వారిలో 5,000 మందికి మాత్రమే దాతల సహకారం లభిస్తున్నది. బతికున్నప్పుడు కూడా కొన్నింటిని దానం చేయొచ్చు..కిడ్నీ, ఎముకమజ్జ, రక్తం, కాలేయంలో కొంత భాగం, ఊపిరి తిత్తుల్లో కొంతభాగం, పాంక్రియాస్ లో కొంతభాగం ఇవ్వొచ్చు. అయితే ఇందులో ఎవరెవరికి ఏవేవీ అమరుతాయో వాటిని మాత్రమే వైద్యులు అమర్చడానికి నిర్ణయిస్తారు. రక్తం గురించి... అది వారి గ్రూపులను బట్టి ఏ వ్యక్తికి సరిపోతుందో వారికే దానం చేస్తారు. ఎముకమజ్జ, కాలేయం, ఊపిరితిత్తులు వంటివి కొన్ని రక్త సంబంధీకులకు చాలా పనికొస్తాయి. సహజ మరణం చెందిన వ్యక్తిలో పనికొచ్చే అవయవాలు..కళ్లు, గుండె వాల్వ్ లు, చర్మం, ఎముకలు, కార్టిలాజ్, నరాలు. అదే బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తిలో పనికొచ్చే అవయవాలు..కిడ్నీలు, కాలేయం, ఊపిరితిత్తులు, పాంక్రియాస్, చిన్నపేగు, స్వరపేటిక, చేతులు, యు-టెరస్, అండాలు, కళ్లు, చర్మం, ఎముకలు, కార్టిలాజ్, నరాలు, కాలి వేళ్లు, చేతి వేళ్లు, మధ్య చెవి ఎముకలు.

### అవయవాలు అమర్చేందుకు ఎంత సమయం పడుతుందంటే..

ఊపిరి తిత్తులు, గుండె 6 గంటలలోపు, మూత్రపిండాలు 48 గంటల లోపు, నేత్రాలు 4 గంటలలోపు, కాలేయం 12 గంటల లోపు, క్లోమం 24 గంటల లోపల సమయం కావాలి. ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి ఒక్కరూ అవయవ దానాలు చేయొచ్చు. వయస్సు, ఆరోగ్యం, జాతితో సంబంధం లేకుండా అందరూ తమను తాము అవయవ కణజాల దాతలుగా భావించవచ్చు. దాతగా ఉండటానికి...వయసు ఏదైనా కొత్తగా పుట్టినవారు, సీనియర్ సిటిజన్లు కూడా అవ-యవ దాతలు కావచ్చు. అనారోగ్యంతో ఉన్న వ్యక్తి కూడా మరణం తరువాత అవయవాలను లేదా కణ జాలాలను దానం చేయ గలుగుతారు. వైద్యులు అవయవాలను పరిశీలించి, దానం చేయడానికి తగినదా కాదా అని నిర్ణయిస్తారు. స్వచ్ఛంధ సంస్థలు, కొంత మంది అభ్యుదయ వాదులు మాత్రమే అవయవాలను దానం చేసేందుకు ముందుకు వస్తున్నారు. ప్రజల్లో ఇంకా చైతన్యం, అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. అవయవ దానాలు, వాటి మార్పిడిలపై ప్రభుత్వాలు, స్వచ్ఛంధ సంస్థలు ఇంకా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# "పరమ పవిత్రమైనది నిర్జల ఏకాదశి"



తిథులు అన్నింటిలోకి ఏకాదశి చాలా పవిత్రమైనది. ఇది ఉపవాసాలకు ఉద్దిష్టమైన దినం. ఏకాదశి 15 రోజులకు ఒకసారి వస్తుంది. పక్షానికి ఒకటి, మాసానికి రెండు చొప్పున సంవత్సరానికి ఇరవై నాలుగు, అధిక మాసం వచ్చే సంవత్సరంలో ఇరవై ఆరు ఏకాదశులు వస్తాయి. వస్తాయి ఇవన్నీ ప్రత్యక్ష పర్వాలుగా ఆచరించ బడతాయి "పద్మ పురాణం ఉత్తర ఖండం"లో ఏకాదశి వ్రత మహత్యం వివరించబడింది. ఏకాదశి సకలోపద్రవ నాశక మైనది. దీనితో సమానమైన వ్రతం లేదు. ఏకాదశ ఇంద్రియాలచే, చేసిన పాపాలన్నీ ఏకాదశి ఉపవాసంతో నశిస్తాయి. సకల వర్ణాల వారికి, ఆశ్రమ వాసులకు, స్త్రీలకు, ఏకాదశి వ్రతం చేయదగినది. దశమితో కూడిన ఏకాదశిని వర్జించి, పరిశుద్ధమైన ఏకాదశి యందు ఉపవాసం చేయాలి. దశమి నాడు ఏకభుక్తం చేసి ఆ రాత్రి కటిక నేలపై పరుండి, మరునాడు ఏకాదశినాడు, ఉసిరిక నూరి శరీరానికి పూసుకుని స్నానమాచరించి, ఉపవాసం ఉండి, పురాణ పఠనా తత్పరులై, పగలు నిద్రింపక, రాత్రి వరకు కటిక నేలపై విశ్రమించి ద్వాదశినాడు పూజ పారణ భోజనం చేయాలి. ఏకాదశి అన్నింటిలోనూ కఠినతరమైనది "నిర్జల ఏకాదశి". జేష్ఠ శుద్ధ పాడ్యమి నుండి దశమి వరకు "గంగోత్సవాల"ను నిర్వహించడం ఆచారం. జేష్ట మాసం లో ఎండలు మెండుగా ఉంటాయి. భూమిలో నీటి మట్టం చాలావరకు అడుగుకు పోతుంది. అట్టి గడ్డు వేసవిలో, ఏకాదశి ఈనాడు, పచ్చి మంచి నీళ్ళు అయినా పుచ్చుకోకుండా, ఉపవాస దీక్ష ఆచరించడం సనాతన సాంప్రదాయ ఆచారం. అందుకే దీనికి "నిర్జలైకాదశి" అని పేరు వచ్చింది. నిర్జలైకాదశి "భీముని" వలన ఏర్పడినట్లు పురాణగాథ ఉంది భీముడు తిండిపోతు. ఒక పూట కూడా తిండి లేకుండా అస్సలు ఉండలేడు. అందుచేత దశమి నాడు ఏకభుక్తం చేసి, ఏకాదశి నాడు ఒక పూట అయినా భోజనం లేకుండా, ఉపవాసం ఉండే ప్రసక్తే ఆయనకు రాదు. పాండవులు అంతా ఏకాదశి వ్రతాచరణ చేస్తుండగా, భీముడు ఆచరించ లేక పోయేవాడు. అయితే భీముడు వేదవ్యాస మహర్షిని సంప్రదించగా, "జేష్ట మాసం లో సూర్యుడు వృషభ రాశి నుండి మిథున రాశి లో ప్రవేశిస్తాడు, కనుక అప్పుడు "నీవు జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి నాడు నీళ్ల కానీ ముట్టకుండా, అన్నం తినకుండా ఉండాలి, అలా చేస్తే, ఏడాదిలో ఇరవై నాలుగు ఏకాదశి వ్రతాలు చేసిన ఫలితం నీకు సమ కూర గలదు" అని వ్యాసుడు వివరించగా భీముడు ఆచరించడం జరిగింది. తద్వారా భీముడు ఏడాది ఏకాదశి వ్రత ఫలం పొందినట్లు చెప్పబడింది. అందుకే దీనిని "భీంసేని ఏకాదశి" అని కూడా అంటారు. "స్మృతి కౌస్తుభం", "చతుర్వర్గ చింతామణి" గ్రంథాలలో నిర్జలైకాదశి గురించి విపులీకరించ బడింది. నిర్జల ఏకాదశి నాడు విష్ణు పూజ చేయడం పరిపాటి. విష్ణు ప్రతిమకు, సాలగ్రామకు పంచామృత అభిషేకం, జలాభిషేకం, పుష్ప, ఫల, హారతి సమర్పణ, వస్త్రాలు, ధాన్యాలు, గొడుగులు, విసనకర్రలు, ఉద కుంభాలు, వస్త్రాలు, బంగారం, గోవు,మంచం దానం చేయడం, రాత్రి జాగరణ, విధాయక కృత్యాలు. బ్రాహ్మీ ముహూర్తంలో "విష్ణు సహస్రనామాల" తో ప్రారంభించి, "ఓం నమో భగవతే వాసుదేవాయ" మహా మంత్ర జపం చేస్తూ ఉండాలి. రామాయణ సంబంధ అరణ్య కాండ పఠించాలి. తల్లిదండ్రుల, గురువుల ఆశీస్సులు పొంది, ఆధ్యాత్మిక పుస్తక దానం చేయడం పుణ్యప్రదం. మానవులతో పాటు, జంతువులకు పక్షులకు ఆహారం, శీతల పానీయాలు ఇవ్వాలి. నిర్జల ఏకాదశి వ్రతాచరణ ద్వారా మోక్ష ప్రాప్తియే కాకుండా, ఆచరించినవారికి "యమపురి" ఉండదని, మరణానంతరం నేరుగా వైకుంఠ లోక ప్రాప్తి లభించ గలదని, పురాణాలు స్పష్టం చేస్తున్నాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెలుగు రాష్ట్రాల్లో స్థిరంగా ఇంధన ధరలు

**హైదరాబాద్, జూన్ 24 :** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు అంతర్జాతీయ ముడి చమురు మార్కెట్ ఒడిదుడుకులపై ఆధారపడి ఉండగా, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు ధరలను సమీక్షించి కొత్త రేట్లను ప్రకటిస్తున్నాయి. ఈ క్రమంలో జూన్ 24, 2026న తెలుగు రాష్ట్రాల్లో ఇంధన ధరలు దాదాపు స్థిరంగా కొనసాగాయి. హైదరాబాద్‌లో నేటి ధరల ప్రకారం లీటర్ పెట్రోల్ రూ.115.69గా, డీజిల్ రూ.103.82గా నమోదైంది. గత కొన్ని రోజులుగా ధరల్లో పెద్దగా మార్పులు లేకపోయినా, రవాణా ఖర్చులు మరియు స్థానిక పన్నుల కారణంగా జిల్లాల వారీగా స్వల్ప వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. వరంగల్ సహా ఇతర తెలంగాణ ప్రధాన నగరాల్లో కూడా ధరలు ఇదే స్థాయిలో కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.68గా ఉండగా, డీజిల్ రూ.105.36 వద్ద విక్రయమవుతోంది. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి వంటి నగరాల్లో కూడా దాదాపు ఇదే ధరలు కొనసాగుతున్నాయని సమాచారం. ఇంధన ధరలు ప్రతిరోజూ మారే అవకాశం ఉండటంతో వాహనదారులు తమ ప్రాంతంలోని తాజా రేట్లను బంకుల్లో లేదా అధికారిక వనరుల ద్వారా తనిఖీ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.






# బంగారం తగ్గుదల

**హైదరాబాద్, జూన్ 24 :** బంగారం కొనాలనుకునే వారికి శుభవార్త. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. అమెరికా డాలర్ బలపడటం, అక్కడి బాండ్ రాబడులు పెరగడం వంటి కారణాలతో పసిడిపై డిమాండ్ తగ్గినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330గా నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,32,300గా ఉంది. వెండి ధరలు కూడా తగ్గి, కిలో వెండి రూ.2,40,000గా కొనసాగుతోంది. తెలంగాణలోని వరంగల్, నిజామాబాద్, ఖమ్మం నగరాల్లో కూడా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330గా, 22 క్యారెట్లు రూ.1,32,300గా ఉంది. ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి నగరాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల విషయానికి వస్తే చెన్నైలో ధర కొంత ఎక్కువగా రూ.1,45,640గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు వంటి నగరాల్లో మాత్రం ధరలు హైదరాబాద్ స్థాయిలోనే ఉన్నాయి. ఢిల్లీ, జైపూర్ నగరాల్లో స్వల్పంగా అధిక ధరలు కనిపిస్తున్నాయి. మార్కెట్ నిపుణుల ప్రకారం అంతర్జాతీయ పరిస్థితులు స్థిరపడితే ధరల్లో మరింత మార్పులు వచ్చే అవకాశం ఉంది. బంగారం ధరలు రోజువారీగా మారుతుండటంతో కొనుగోలు చేసే ముందు తాజా ధరలు పరిశీలించాలని సూచిస్తున్నారు.

# ఏపీలో చరిత్రాత్మక అడుగు..

## జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ ప్రారంభం



**కర్నూలు, జూన్ 24 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఖనిజ రంగంలో కీలక ముందడుగు పడింది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రారంభించారు. రూ.405 కోట్ల భారీ పెట్టుబడితో ప్రైవేటు రంగంలో ఇది అతిపెద్ద ప్రాజెక్టుగా నిలిచింది. జియో మైసూర్, డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థలు సంయుక్తంగా ఈ బంగారు తవ్వకాల ప్రాజెక్టును చేపట్టాయి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఇది కొత్త అధ్యాయంగా భావిస్తున్నారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు సుమారు 1,500 ఎకరాల భూమిని కేటాయించింది. తొలి దశలో 600 ఎకరాల్లో తవ్వకాలు, ప్రాసెసింగ్ పనులు ప్రారంభమయ్యాయి. మొదటి ఏడాదిలోనే సుమారు 400 కిలోల బంగారం ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. భవిష్యత్తులో దీన్ని ఏటా 1,000 కిలోల వరకు పెంచే ప్రణాళికలు ఉన్నాయని సమాచారం. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిపి 700 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి 4 శాతం రాయల్టీ రూపంలో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మైనింగ్ పనులు కొనసాగుతుండగా, పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఇతర బంగారు నిల్వల అన్వేషణపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.

# క్రెడిట్ కార్డ్ ఎలా వాడాలి?

**న్యూఢిల్లీ, జూన్ 24:** క్రెడిట్ కార్డ్ నేటి ఆర్థిక వ్యవస్థలో ఒక కీలక ఆర్థిక సాధనంగా మారింది. సరైన విధంగా ఉపయోగిస్తే ఇది వడ్డీ లేని తాత్కాలిక రుణంగా మారి అనేక ఆర్థిక ప్రయోజనాలను అందిస్తుంది. అయితే నిర్లక్ష్యంగా వాడితే అధిక వడ్డీ భారం మరియు అప్పుల సమస్యలకు దారితీసే ప్రమాదం కూడా ఉంటుంది. క్రెడిట్ కార్డ్‌ను బ్యాంక్ ఇచ్చే ఒక రకమైన తాత్కాలిక లోన్‌గా పరిగణించవచ్చు. మీరు ఏదైనా కొనుగోలు చేసిన తర్వాత ఆ మొత్తం బిల్లింగ్ సైకిల్‌లో బిల్లు రూపంలో వస్తుంది. సాధారణంగా 45 రోజుల వరకు వడ్డీ లేని గడువు లభిస్తుంది. ఈ సమయంలో పూర్తి బిల్లు చెల్లిస్తే ఎలాంటి వడ్డీ చెల్లించాల్సిన అవసరం ఉండదు. క్రెడిట్ కార్డ్‌ల ప్రధాన ప్రయోజనాల్లో డిస్కౌంట్లు, క్యాష్‌బ్యాక్‌లు, రివార్డ్ పాయింట్లు ఉన్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో ప్రత్యేక ఆఫర్లు కూడా లభిస్తాయి. అదనంగా మోసపూరిత లావాదేవీలకు సంబంధించి మెరుగైన రక్షణ కూడా క్రెడిట్ కార్డ్‌లకు ఉంటుంది. అయితే జాగ్రత్తలు తీసుకోకపోతే ఇవి పెద్ద ఆర్థిక భారంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా కేవలం కనీస చెల్లింపు మాత్రమే చేయడం వల్ల మిగిలిన మొత్తంపై 24% నుంచి 48% వరకు అధిక వడ్డీ పడుతుంది. ఇది వినియోగదారులను అప్పుల ఊబిలోకి నెట్టే ప్రమాదం కలిగిస్తుంది. క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో కూడా చాలా ముఖ్యమైన అంశం. మీ లిమిట్‌లో 30% లోపు మాత్రమే ఖర్చు చేయడం ద్వారా సిబిల్ స్కోర్ మెరుగుపడుతుంది. ఉదాహరణకు రూ.1 లక్ష లిమిట్ ఉంటే రూ.30,000 లోపు ఖర్చు చేయడం మంచిది. ఎక్కువ కార్డులు కలిగి ఉండటం కొంతవరకు ఉపయోగకరమైనా, వాటి నిర్వహణ మరియు బిల్లుల గమనికలో జాగ్రత్త అవసరం. స్థిర ఆదాయం ఉన్న ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు సరైన ఆదాయ రుజువులతో క్రెడిట్ కార్డ్ పొందవచ్చు. కొన్ని బ్యాంకులు విద్యార్థులకు కూడా వారి కుటుంబ ఆర్థిక స్థితిని బట్టి కార్డులు ఇస్తాయి. కుటుంబ సభ్యుల కోసం అదనపు కార్డులు తీసుకుని ఒకే లిమిట్‌ను పంచుకోవడం కూడా సాధ్యం. క్రెడిట్ కార్డ్ బకాయిలను చెల్లించలేక సెటిల్‌మెంట్ చేసుకోవడం భవిష్యత్‌లో సిబిల్ స్కోర్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది. అలాగే కార్డ్‌ను అధికారికంగా క్లోజ్ చేయకుండా వదిలేస్తే కూడా ఛార్జీలు పడే అవకాశం ఉంటుంది. మొత్తం మీద క్రెడిట్ కార్డ్ ఒక శక్తివంతమైన ఆర్థిక సాధనం. దాన్ని అర్థం చేసుకుని, నియంత్రణతో ఉపయోగిస్తే ఆర్థిక ప్రయోజనాలు పొందవచ్చు.




# బజాజ్ ఆటోపై రాన్సమ్‌వేర్ దాడి

**ముంబై, జూన్ 24 :** ప్రముఖ వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో లిమిటెడ్ సైబర్ దాడికి గురైనట్లు అధికారికంగా ప్రకటించింది. కంపెనీ ఐటీ మౌలిక వసతులపై రాన్సమ్‌వేర్ దాడి జరిగినట్లు మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో గుర్తించినట్లు సంస్థ వెల్లడించింది. ఈ సైబర్ దాడి ప్రభావం బజాజ్ ఆటోతో పాటు దాని అనుబంధ సంస్థ బజాజ్ ఆటో టెక్నాలజీ లిమిటెడ్‌పై కూడా పడినట్లు కంపెనీ తెలిపింది. వెంటనే అప్రమత్తమైన అంతర్గత సాంకేతిక బృందాలు, యాజమాన్యం, అలాగే బయటి సైబర్ భద్రత నిపుణులు కలిసి రక్షణ చర్యలు ప్రారంభించినట్లు సమాచారం. సకాలంలో స్పందించడం వల్ల ప్రమాద తీవ్రతను పెద్ద స్థాయిలో అదుపులోకి తెచ్చినట్లు సంస్థ పేర్కొంది. ఈ ఘటనపై ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌కు కూడా సమాచారం అందించినట్లు బజాజ్ ఆటో స్పష్టం చేసింది. అయితే ఈ దాడి వల్ల ఎంత డేటా లీక్ అయ్యింది, రోజువారీ కార్యకలాపాలకు ఎంత మేర ప్రభావం పడింది, అలాగే ఆర్థిక నష్టం ఎంత అన్న విషయాలపై ఇప్పటివరకు స్పష్టత రాలేదు. ఉత్పత్తి ప్రక్రియపై ప్రభావం ఉందా లేదా అన్నది కూడా కంపెనీ ఇంకా వెల్లడించలేదు. ప్రస్తుతం ఐటీ వ్యవస్థలను పునరుద్ధరించే పనులు కొనసాగుతున్నాయని, త్వరలో మరిన్ని వివరాలు వెల్లడిస్తామని కంపెనీ వర్గాలు తెలిపాయి.




# నీరవ్ మోడీకి లండన్ హైకోర్టు షాక్

## బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.100 కోట్లకు పైగా చెల్లించాలంటూ తీర్పు



**లండన్, జూన్ 24 :** పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీకి లండన్ హైకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు చెందిన కంపెనీకి ఇచ్చిన రుణానికి వ్యక్తిగత హామీ కింద బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 10.7 మిలియన్ డాలర్లకు పైగా (సుమారు రూ.100 కోట్లకు పైగా) చెల్లించాలని కోర్టు తీర్పు వెలువరించింది. లండన్ సర్క్యూట్ కమర్షియల్ కోర్టు జస్టిస్ సైమన్ టింక్లర్ ఈ తీర్పును ప్రకటిస్తూ, అసలు బకాయి అయిన 4.1 మిలియన్ డాలర్లకు అదనంగా వడ్డీ కలిపి మొత్తం చెల్లించాల్సిన బాధ్యత నీరవ్ మోడీపై ఉందని స్పష్టం చేశారు. బ్యాంకు కోరిన మొత్తం ఎందుకు చెల్లించకూడదో చెప్పేందుకు ఆయన తరఫున సరైన వాదనలు సమర్పించలేదని కోర్టు పేర్కొంది. ఈ కేసు 2012లో దుబాయ్‌కు చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ ఫ్జీజు కంపెనీకి బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన రుణానికి సంబంధించినది. 2013లో రుణం తిరిగి చెల్లించకపోతే బాధ్యతను స్వీకరిస్తానని నీరవ్ మోడీ వ్యక్తిగత హామీ పత్రంపై సంతకం చేశారు. 2018లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం వెలుగులోకి వచ్చిన తర్వాత, బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా రుణ వసూళ్ల కోసం చర్యలు ప్రారంభించింది. అయితే నోటీసులు అందలేదని, హామీ అమలు చేయలేమని నీరవ్ మోడీ వాదించగా, కోర్టు ఆ వాదనలను తిరస్కరించింది. ఈ తీర్పు బ్యాంక్ ఆఫ్ ఇండియాకు కీలక న్యాయ విజయంగా పరిగణించబడుతోంది. ప్రస్తుతం నీరవ్ మోడీ బ్రిటన్‌లో జైల్లో ఉండగా, ఆయనను భారత్‌కు అప్పగించే ప్రక్రియపై కూడా వేర్వేరు కేసులు కొనసాగుతున్నాయి.

# 9 లక్షలకే బడ్జెట్ ఈవీ కారు?

**న్యూఢిల్లీ, జూన్ 24:** భారతదేశంలో ఎలక్ట్రిక్ కార్ల విప్లవం వేగంగా పెరుగుతున్నప్పటికీ, అధిక ధరల కారణంగా ఇవి ఇంకా మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి పూర్తిగా రాలేదు. మార్కెట్లో ఉన్న చాలా ఈవీ కార్ల ధరలు రూ.10 లక్షలు దాటుతుండటంతో సాధారణ కొనుగోలుదారులు వెనుకంజ వేస్తున్నారు. ఈ నేపథ్యంలో చైనా వాహన దిగ్గజం బీవైడీ తక్కువ ధరలో కొత్త ఈవీతో భారత మార్కెట్లో సంచలనం సృష్టించేందుకు సిద్ధమవుతోంది. మన దేశంలో లక్షలాది మంది పెట్రోల్, సీఎన్‌జీ వాహనాల నుంచి ఎలక్ట్రిక్ వాహనాల వైపు మారాలని ఆశపడుతున్నారు. అయితే అధిక ధరలు, బ్యాటరీ ఖర్చులు, సాంకేతిక వ్యయాల కారణంగా ఆ కల ఇంకా పూర్తిగా నెరవేరడం లేదు. ప్రస్తుతం టాటా మోటార్స్, ఎంజీ మోటార్స్ వంటి కొన్ని కంపెనీలు మాత్రమే బడ్జెట్ పరిధిలో ఈవీ కార్లను అందిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బీవైడీ సంస్థ ఎలక్ట్రిక్ వాహన రంగంలో ఇప్పటికే అగ్రస్థానంలో ఉంది. ఈ సంస్థకు ఉన్న ప్రధాన బలం ఏమిటంటే, వారు సొంతంగా బ్యాటరీలను తయారు చేసుకుంటారు. దీని వల్ల ఉత్పత్తి వ్యయం తగ్గి కార్లను తక్కువ ధరకు అందించగలుగుతున్నారు. చైనాలో ఈ సంస్థ విడుదల చేసిన 'సీగల్' మోడల్ భారీ విజయం సాధించింది. అదే కారు కొన్ని దేశాల్లో 'డాల్ఫిన్ మినీ' పేరుతో విక్రయించబడుతోంది. ఈ కారు చైనా మార్కెట్లో భారత కరెన్సీలో సుమారు రూ.9 లక్షల పరిధిలోనే అందుబాటులో ఉంది. ఇదే ధరలో భారత్‌లోకి వస్తే ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్ సమీకరణాలు పూర్తిగా మారిపోయే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఈ అంచనాలకు మరింత బలం చేకూరుస్తూ, బీవైడీ సంస్థ ఇటీవల 'సీగల్' పేరును భారతదేశంలో ట్రేడ్‌మార్క్ చేసింది. సాధారణంగా ఏ కంపెనీ అయినా కొత్త మోడల్‌ను ఒక దేశంలో ప్రవేశపెట్టే ముందు ఇలాంటి చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేస్తుంది. అందుకే ఈ కారు త్వరలోనే భారత రోడ్లపై కనిపించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ మోడల్ నిజంగా భారత మార్కెట్లో ప్రవేశిస్తే, తక్కువ ధరలో ఈవీ కార్లు అందుబాటులోకి వచ్చి మధ్యతరగతి వినియోగదారులకు పెద్ద ఊరట కలిగించే అవకాశం ఉంది.





## మహిళా క్రికెటర్లకు ఐసీసీ కొత్త గైడ్‌లైన్స్‌పై సచిన్ టెండూల్కర్ హర్షం

**న్యూఢిల్లీ, జూన్ 24:** మహిళా క్రికెటర్ల కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రవేశపెట్టిన కొత్త మార్గదర్శకాలపై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రసవానంతరం మహిళా క్రీడాకారిణులు మళ్లీ మైదానంలోకి తిరిగి రావడానికి ఈ నిబంధనలు పెద్ద ఊతమని ఆయన అభివర్ణించారు. మాతృత్వం మరియు వృత్తిగత కెరీర్‌ను సమన్వయం చేసుకునే అవకాశం కల్పించే విధంగా ఈ మార్గదర్శకాలు రూపొందించబడటం మహిళా క్రికెట్‌కు చారిత్రాత్మక అడుగుగా సచిన్ పేర్కొన్నారు. మహిళా క్రీడాకారిణులు తమ కుటుంబ బాధ్యతల కారణంగా కెరీర్‌ను మధ్యలో ఆపాల్సిన పరిస్థితి ఇకపై తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా 'రిటర్న్ టు ప్లే పోస్ట్-ప్రెగ్నెన్సీ గైడ్‌లైన్స్'ను విడుదల చేసింది. గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో, ప్రసవం తర్వాత క్రీడాకారిణుల శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మొత్తం ఆరు దశల విధానాన్ని ఇందులో పొందుపరిచారు. ప్రపంచ క్రికెట్ చరిత్రలో మహిళా క్రీడాకారిణుల కోసం ఇలాంటి సమగ్ర విధానం తీసుకురావడం ఇదే మొదటిసారి. ఈ మార్గదర్శకాలు మహిళా క్రికెటర్లు దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని మాతృత్వం కారణంగా కోల్పోకూడదనే ఉద్దేశంతో రూపొందించబడినట్లు ఐసీసీ ఛైర్మన్ జై షా తెలిపారు. ఈ నిర్ణయం మహిళా క్రికెట్ అభివృద్ధికి కీలక మలుపు అవుతుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.



## షోయబ్ అక్తర్ ఇంట విషాదం

**ఇస్లామాబాద్, జూన్ 24:** పాకిస్థాన్ మాజీ క్రికెటర్, "రావల్పిండి ఎక్స్‌ప్రెస్"గా ప్రసిద్ధి చెందిన షోయబ్ అక్తర్ ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. ఆయన సోదరుడు షాహిద్ అక్తర్ మృతి చెందినట్లు పాకిస్థాన్ మీడియా వెల్లడించింది. ఈ విషయాన్ని షోయబ్ అక్తర్ స్వయంగా తన ఎక్స్ ఖాతాలో ధృవీకరించారు. తన సోదరుడు షాహిద్ అక్తర్ అల్లా వద్దకు చేరుకున్నారని పేర్కొంటూ భావోద్వేగ సందేశం పోస్ట్ చేశారు. అయితే ఆయన మృతికి గల కారణం ఇప్పటివరకు స్పష్టంగా తెలియరాలేదు. ఈ ఘటనపై క్రికెట్ అభిమానులు, మాజీ పాకిస్థాన్ క్రికెటర్లు సోషల్ మీడియాలో సంతాపం వ్యక్తం చేస్తున్నారు. మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్ కూడా షాహిద్ అక్తర్ మృతికి నివాళి అర్పించారు. ఆయన అంత్యక్రియలు హెచ్-8 శ్మశానవాటికలో నిర్వహించనున్నట్లు సమాచారం. గతంలో షోయబ్ అక్తర్ తల్లి కూడా మృతి చెందడంతో కుటుంబం మరోసారి విషాదంలో మునిగిపోయింది. ఇటీవల ఆయన క్రికెట్ పండిట్‌గా మారి టీ20 వరల్డ్ కప్ సహా పలు మ్యాచ్‌లపై తన విశ్లేషణలు, అభిప్రాయాలను పంచుకుంటూ వస్తున్నారు.

### ఫిఫా వరల్డ్ కప్‌లో కొలంబియా సత్తా..
## నాకౌట్‌కు అర్హత

**న్యూఢిల్లీ, జూన్ 24:** అంతర్జాతీయ ఫుట్‌బాల్ వేదికపై కొలంబియా జట్టు అద్భుత ప్రదర్శనతో సరికొత్త రికార్డు నమోదు చేసింది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఫిఫా వరల్డ్ కప్‌లో గ్రూప్ దశను విజయవంతంగా పూర్తి చేసి నాకౌట్ దశకు అధికారికంగా అర్హత సాధించింది. బుధవారం జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో కొలంబియా జట్టు కాంగో డీఆర్‌ను 1-0 తేడాతో ఓడించింది. ఈ విజయంతో కొలంబియా తదుపరి రౌండ్‌కు దూసుకెళ్లింది. మ్యాచ్ మొత్తం ఇరు జట్లు గట్టి డిఫెన్స్‌తో ఆడగా, తొలి అర్ధభాగంలో గోల్స్ నమోదు కాలేదు. కొలంబియా తరఫున జేమ్స్ రోడ్రిగెస్, లూయిస్ డియాజ్, జాన్ ఆరియాస్ వంటి స్టార్ ఆటగాళ్లు అనేక అవకాశాలు సృష్టించినప్పటికీ ఫలితం రాలేదు. అయితే 76వ నిమిషంలో మ్యాచ్ మలుపు తిరిగింది. జువాన్ క్వింటెరో అందించిన అద్భుతమైన పాస్‌ను డేనియల్ మునోజ్ వండర్ గోల్‌గా మలిచి జట్టుకు ఆధిక్యం అందించాడు. ఆ ఒక్క గోల్‌ను చివరి వరకు కాపాడుకున్న కొలంబియా విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో కొలంబియా జట్టు నాకౌట్ దశలోకి ప్రవేశించి టోర్నమెంట్‌లో తన ఆశలను మరింత బలపరుచుకుంది.

# పాకిస్థాన్ క్రికెట్‌లో భారీ మార్పులు!

- టెస్టు, వన్డే, టీ20లకు వేర్వేరు జట్లు..!
- కొత్త సెంట్రల్ కాంట్రాక్ట్ విధానానికి పీసీబీ సన్నాహాలు




**లాహోర్, జూన్ 24:** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) జాతీయ జట్టు నిర్మాణంలో కీలక మార్పులకు శ్రీకారం చుడుతోంది. భవిష్యత్తులో టెస్టు, వన్డే, టీ20 ఫార్మాట్లకు వేర్వేరు జట్లను రూపొందించే దిశగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా కొత్త సెంట్రల్ కాంట్రాక్ట్ విధానాన్ని అమల్లోకి తీసుకురావడానికి పీసీబీ కసరత్తు ప్రారంభించింది. పీసీబీ సీనియర్ సెలెక్టర్, హై పెర్ఫార్మెన్స్ సెంటర్ అధిపతి అఖీబ్ జావేద్ మాట్లాడుతూ ఆధునిక క్రికెట్‌లో ఒకే ఆటగాడు మూడు ఫార్మాట్లలోనూ సమర్థంగా రాణించడం క్రమంగా కష్టతరమవుతోందన్నారు. ప్రతి ఫార్మాట్‌కు వేర్వేరు నైపుణ్యాలు అవసరమవుతున్నాయని, ముఖ్యంగా టెస్టు మరియు టీ20 క్రికెట్‌ల మధ్య పూర్తిగా భిన్నమైన దృక్పథం అవసరమని వివరించారు.

### ఫార్మాట్‌ల వారీగా ప్రత్యేక విభాగాలు

కొత్త సెంట్రల్ కాంట్రాక్ట్ విధానంలో ఆటగాళ్లను వారి ప్రదర్శన, ప్రత్యేకతల ఆధారంగా వేర్వేరు విభాగాలుగా విభజించనున్నారు. టెస్టు స్పెషలిస్టులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వడంతో పాటు, వారి ప్రదర్శనకు అనుగుణంగా అధిక వేతనాలు చెల్లించే విధానాన్ని కూడా పరిశీలిస్తున్నారు. టెస్టు-వన్డే, వన్డే-టీ20, టెస్టు-టీ20 వంటి కలయిక విభాగాలతో పాటు పూర్తిగా ఒక్కో ఫార్మాట్‌కు ప్రత్యేక కేటగిరీలు రూపొందించే అవకాశముంది. దీని ద్వారా ప్రతి ఫార్మాట్‌కు అనుగుణమైన ఆటగాళ్లను తయారుచేయడం, జట్ల సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

### టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యం

ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్‌ల ప్రభావం పెరుగుతున్న తరుణంలో టెస్టు క్రికెట్ ప్రాధాన్యం తగ్గిపోకుండా చూడాలని పీసీబీ భావిస్తోంది. అందుకే టెస్టు క్రికెట్‌లో రాణించే ఆటగాళ్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, అధిక పారితోషికం అందించే దిశగా ఆలోచిస్తోంది.

### ప్రపంచ క్రికెట్‌పై ప్రభావం?

పాకిస్థాన్ అమలు చేయబోతున్న ఈ విధానం విజయవంతమైతే ఇతర దేశాలు కూడా ఇదే తరహా వ్యవస్థను అనుసరించే అవకాశముందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకే దేశం నుంచి మూడు ఫార్మాట్లకు దాదాపు వేర్వేరు జట్లు బరిలోకి దిగే పరిస్థితి భవిష్యత్తులో ఏర్పడవచ్చని వారు అంచనా వేస్తున్నారు. పాకిస్థాన్ క్రికెట్‌లో చేపట్టబోతున్న ఈ సంస్కరణలు జట్టు ప్రదర్శనను ఎంతవరకు మెరుగుపరుస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. టెస్టు, వన్డే, టీ20 ఫార్మాట్లకు ప్రత్యేక వ్యూహాలతో ముందుకెళ్లాలని పీసీబీ భావిస్తుండటంతో ప్రపంచ క్రికెట్ వర్గాలు ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్ల జోరు

**గిల్ రెండో స్థానం, బుమ్రాకు అగ్రస్థానం**






**దుబాయ్, జూన్ 24 :** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు అద్భుతంగా రాణించారు. వన్డే బ్యాటింగ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండో స్థానానికి ఎగబాకగా, టెస్ట్ బౌలింగ్‌లో జస్ప్రీత్ బుమ్రా అగ్రస్థానాన్ని న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీతో పంచుకున్నాడు. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో డారిల్ మిచెల్ మొదటి స్థానంలో కొనసాగుతుండగా, గిల్ కేవలం 24 రేటింగ్ పాయింట్ల తేడాతో రెండో స్థానంలో నిలిచాడు. ఆఫ్ఘనిస్థాన్‌పై జరిగిన సిరీస్‌లో గిల్ స్థిరమైన ప్రదర్శనతో మూడు స్థానాలు మెరుగుపరుచుకున్నాడు. అదే సిరీస్‌లో ఇషాన్ కిషన్ 21 స్థానాలు ఎగబాకి 43వ ర్యాంకుకు చేరడం విశేషం. భారత బౌలింగ్ విభాగంలో కూడా మెరుగుదల కనిపించింది. అర్ష్‌దీప్ సింగ్ 16 స్థానాలు ఎగబాకి 22వ ర్యాంకుకు చేరగా, ప్రసిద్ధ్ కృష్ణ 34 స్థానాలు మెరుగుపరుచుకుని 58వ స్థానంలో నిలిచాడు. వాషింగ్టన్ సుందర్ ఆల్‌రౌండర్ల జాబితాలో 71వ స్థానాన్ని సాధించాడు. టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో 11 వికెట్లు తీసిన మాట్ హెన్రీ, బుమ్రాతో కలిసి సంయుక్తంగా నంబర్ వన్ స్థానాన్ని పంచుకున్నాడు. 2024 నవంబర్ నుంచి ఒంటరిగా అగ్రస్థానంలో ఉన్న బుమ్రాకు ఇది కొత్త పోటీగా మారింది. టెస్ట్ బ్యాటింగ్‌లో ఇంగ్లండ్ స్టార్ జో రూట్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని తిరిగి నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇది ఆయన కెరీర్‌లో 12వసారి ఈ ఘనత సాధించడం గమనార్హం. టీ20 ర్యాంకింగ్స్‌లో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. ఆస్ట్రేలియా తరఫున మిచెల్ మార్ష్ టాప్-10లోకి చేరగా, బంగ్లాదేశ్ బౌలర్ నసుమ్ అహ్మద్ ఏకంగా 27 స్థానాలు ఎగబాకి 11వ ర్యాంకుకు చేరాడు.

# స్టోక్స్-మెక్‌కల్లమ్ మధ్య విభేదాలపై క్లారిటీ

**న్యూఢిల్లీ, జూన్ 24:** ఇంగ్లండ్ టెస్టు జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్, ప్రధాన కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్ మధ్య విభేదాలు ఉన్నాయంటూ కొంతకాలంగా వస్తున్న వార్తలకు తాజాగా స్పష్టత వచ్చింది. న్యూజిలాండ్‌తో మూడో టెస్టు ప్రారంభానికి ముందు మెక్‌కల్లమ్ ఈ అంశంపై స్పందిస్తూ, సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పాడు. స్టోక్స్ తనకు మంచి స్నేహితుడని, ఇద్దరి మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో తొలి టెస్టు అనంతరం జరిగిన ఓ ఘటన నేపథ్యంలో ఇద్దరి పేర్లు ప్రస్తావనకు రావడంతో ఈ చర్చ మరింత వేడెక్కింది. అయితే ఆ సంఘటనతో తమకు సంబంధం లేదని మెక్‌కల్లమ్ వివరించాడు. స్టోక్స్‌తో కలిసి ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నామని, జట్టు ప్రయోజనాలే తమకు ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. 2022లో ఇంగ్లండ్ టెస్టు జట్టు కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన మెక్‌కల్లమ్, స్టోక్స్‌తో కలిసి 'బజ్‌బాల్' అనే దూకుడైన ఆటతీరును ప్రవేశపెట్టి జట్టు ప్రదర్శనను పూర్తిగా మార్చారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య సమన్వయం కీలక పాత్ర పోషించింది. మరోవైపు నైట్‌క్లబ్ ఘటన నేపథ్యంలో గతంలో స్టోక్స్, పేసర్ అట్కిన్సన్‌పై రెండో టెస్టుకు వేటు పడింది. అయితే విచారణ అనంతరం వారికి క్లీన్‌చిట్ లభించడంతో స్టోక్స్ మూడో టెస్టుకు తిరిగి జట్టులో చేరాడు. సిరీస్ ప్రస్తుతం 1-1తో సమంగా ఉండగా, నిర్ణయాత్మక మూడో టెస్టు కోసం ఇంగ్లండ్ జట్టు సన్నద్ధమవుతోంది.





# ఆసియా క్రీడల ఎంపికపై మానికా బాత్రా ఆగ్రహం

**న్యూఢిల్లీ, జూన్ 24:** భారత టేబుల్ టెన్నిస్ స్టార్ మానికా బాత్రా ఆసియా క్రీడల జట్టు ఎంపికపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తనను జట్టు నుంచి తప్పించడానికి గల కారణాలను స్పష్టంగా వివరించకపోతే చట్టపరమైన చర్యలకు వెళ్తానని ఆమె టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాను హెచ్చరించింది. ఈ అంశంపై కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని మానికా మరోసారి విజ్ఞప్తి చేసింది. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా లేకపోవడంపై ఆమె పలు ప్రశ్నలు లేవనెత్తింది. ర్యాంకింగ్స్ ఆధారంగా ఎంపిక జరిగిందా లేదా ఇతర ప్రమాణాలు పరిగణనలోకి తీసుకున్నారా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. ప్రస్తుతం తాను ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 51వ స్థానంలో ఉన్నప్పటికీ, ఎంపికలో ఉపయోగించిన కాలవ్యవధి ఏమిటో తెలియజేయలేదని ఆమె పేర్కొంది. గతంలో భారత్‌కు పతకాలు అందించిన ఆటగాళ్లను కూడా ఈసారి పరిగణనలోకి తీసుకోకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని వ్యాఖ్యానించింది. టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో ఎంపిక నిర్ణయాలు ఎవరు తీసుకుంటారన్నదానిపై కూడా ఆమె సందేహాలు వ్యక్తం చేసింది. అంతర్జాతీయ స్థాయిలో అనుభవం ఉన్న మాజీ క్రీడాకారులు ఈ నిర్ణయాల్లో ఎంతవరకు భాగస్వాములు అవుతున్నారో స్పష్టం చేయాలని ఆమె కోరింది. జపాన్‌లో సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న ఆసియా క్రీడల నేపథ్యంలో ఈ వివాదం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.




## శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో ఈత

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఈత' అధికారిక టీజర్ విడుదలైంది. 'ఛావా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ బయోపిక్ డ్రామాకు దర్శకత్వం వహిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జానపద, లావణి నృత్య కళాకారిణి విఠాబాయి నారాయణగాంకర్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రణదీప్ హుడా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో శ్రద్ధా కపూర్ మునుపెన్నడూ చూడని పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు. గర్భవతిగా ఉండి కూడా స్టేజ్ పై నృత్యం చేయడం, ప్రసవ వేదన అనుభవిస్తూనే కళ కోసం రంగస్థలంపైకి రావడం వంటి భావోద్వేగ సన్నివేశాలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. 'మంచంపై పడి చనిపోతే నన్ను ఒక నిస్సహాయురాలిగా గుర్తుంచు కుంటారు. అదే నృత్యం చేస్తూ చనిపోతే ఒక చరిత్రగా నిలిచిపోతాను' అంటూ శ్రద్ధా కపూర్ చెప్పే డైలాగ్ రోమాలు నిక్కబొడుస్తున్నాయి. ఇక ఈ చిత్రం 2026 ఆగస్టు 28న థియేటర్లలో విడుదల కానుంది. టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.

## ఫోక్ క్వీన్ నాగదుర్గకు వరుస ఆఫర్లు..

### టాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ

యూట్యూబ్ వేదికగా తెలంగాణ ఫోక్ డ్యాన్సలతో గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ ఇప్పుడు వెండితెరపై తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతోంది. సోషల్ మీడియాలో భారీ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఈ యువ నటి ఇప్పుడు వరుస సినిమా అవకాశాలతో బిజీగా మారింది. ఇప్పటికే తమిళంలో తెరకెక్కుతున్న 'లవ్ ఓ లవ్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న నాగదుర్గ, వెండితెరపై తన తొలి అడుగు వేసింది. దర్శకుడు మగేష్ రాజేంద్రన్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో పవిష్ నారాయణ్ సరసన ఆమె ఫీమేల్ లీడ్‌గా నటిస్తోంది. ఇది ఆమెకు తమిళ చిత్రసీమలో తొలి అవకాశం కావడం విశేషం. ఇక టాలీవుడ్‌లో కూడా నాగదుర్గకు పెద్ద అవకాశం దక్కినట్లు సమాచారం. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాసు ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఓ గ్రామీణ కుటుంబ నేపథ్య కథలో ఆమె హీరోయిన్‌గా ఎంపికైనట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో నటుడు ప్రియదర్శి ప్రధాన పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. ఒకప్పుడు యూట్యూబ్‌లో ఫోక్ వీడియోలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నాగదుర్గ ఇప్పుడు వరుసగా సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ వెండితెర వైపు వేగంగా అడుగులు వేస్తోంది. తెలంగాణ గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే పాత్రల్లో ఆమె నటన ఎలా ఉంటుందోనన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. మరోవైపు గతంలో సుకుమార్ చిత్రంలో చిన్న పాత్ర చేసిన ప్రియదర్శి ఇప్పుడు అదే బ్యానర్‌లో హీరోగా నటించనుండటం ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక ఆకర్షణగా మారింది.



## బోనీకపూర్ ఇంట్లో పెళ్లి సందడి



బాలీవుడ్‌లో మరో స్టార్ వెడ్డింగ్‌కు రంగం సిద్ధమైంది. ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ కుటుంబంలో పెళ్లి బాజాలు మోగుతున్నాయి. ఆయన పెద్ద కుమార్తె అన్షులా కపూర్ వివాహ వేడుకలు ముంబైలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తన లాంగ్‌టైమ్ బాయ్‌ఫ్రెండ్ రోహన్ థక్కర్‌తో అన్షులా త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టనుండగా, ప్రస్తుతం ప్రీ వెడ్డింగ్ వేడుకలు కుటుంబ సభ్యుల మధ్య సందడిగా సాగుతున్నాయి. గత ఏడాది న్యూయార్క్‌లో సన్నిహితుల సమక్షంలో నిశ్చితార్థం చేసుకున్న అన్షులా-రోహన్ జంట ఇప్పుడు జూలై 6న పెళ్లి పీటలెక్కబోతోంది. దీంతో కపూర్ కుటుంబంలో ఇప్పటికే పెళ్లి సందడి మొదలైంది. ఈ వివాహ వేడుకల తొలి కార్యక్రమంగా ముంబైలో సంప్రదాయబద్ధంగా 'మాతా కీ చౌకీ' పూజను నిర్వహించారు. వరుడు రోహన్ థక్కర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో ఇరు కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను అన్షులా సోషల్ మీడియాలో పంచుకుంటూ, 'ప్రేమ, కుటుంబం, దేవుని ఆశీస్సులతో మా కొత్త ప్రయాణం ప్రారంభమవుతోంది' అంటూ భావోద్వేగ పోస్ట్ చేసింది. అన్షులా పెళ్లి వేడుకల్లో అన్నయ్య అర్జున్ కపూర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. తల్లి మోనా శౌరీ కపూర్ మరణం తర్వాత అన్షులాకు అర్జున్ కపూరే అండగా నిలిచారు. చెల్లెలి బాధ్యతలను తన భుజాలపై వేసుకుని కుటుంబానికి పెద్దగా వ్యవహరించిన అర్జున్, ఇప్పుడు ఆమె పెళ్లి ఏర్పాట్లను కూడా దగ్గరుండి చూసుకుంటున్నారు. శ్రీదేవి మరణం తర్వాత ఈ నలుగురు తోబుట్టువులు మరింత దగ్గరయ్యారు. ఇప్పుడు అన్షులా పెళ్లి వేడుకల్లో ఆ అనుబంధం స్పష్టంగా కనిపిస్తోంది. జాన్వీ కపూర్, ఖుషీ కపూర్‌లు పెళ్లి ఏర్పాట్లలో చురుకుగా పాల్గొంటూ అక్కకు అండగా నిలుస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సందడి చేస్తూ, డాన్స్‌లు చేస్తూ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా మారారు. సోనమ్ కపూర్, రియా కపూర్‌లతో కలిసి ఒకే ఫ్రేమ్‌లో కనిపించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## చరణ్‌పై మోడీ ప్రశంసలతో పులకించా

మెగాస్టార్ చిరంజీవి తన కుమారుడు రామ్ చరణ్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల 'పెద్ది' సినిమాతో సూపర్ హిట్‌ను అందుకుని టాప్ ట్రెండింగ్‌లో ఉన్న రామ్ చరణ్ రిపబ్లిక్ టీవీ నిర్వహించిన ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమంలో గెస్ట్‌గా పాల్గొన్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ రామ్ చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంబోధించారు. దీనిపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ సుమతీ శతక పద్యంతో తన పోస్ట్‌ను ప్రారంభించారు. 'పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడే పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగా, పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ'. అని రాస్తూ కొడుకు పుట్టగానే తండ్రికి నిజమైన సంతోషం కలగదని, సమాజంలో ఆ కొడుకు గొప్పతనాన్ని చూసి జనాలు మెచ్చుకున్నప్పుడే ఆ తండ్రికి నిజమైన ఆనందం కలుగుతుందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమంలో రామ్ చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంబోధించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని చిరంజీవి తెలిపారు. ఇలాంటి ప్రతిష్టాత్మక వేదికలపై చరణ్‌కు లభిస్తున్న గుర్తింపు, గౌరవం చూస్తుంటే ఒక తండ్రిగా గర్వంగా ఉందన్నారు. తన కృషి, అంకితభావం, నటనతో ప్రేక్షకుల అభిమానాన్ని మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విశేషమైన గుర్తింపును కూడా సంపాదించుకోవడం నిజంగా సంతోషకరమని పేర్కొన్నారు. ఇంకా మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చిరంజీవి ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్‌గా మారింది.




## సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు 'సర్దార్ 2'




తమిళ స్టార్ హీరో కార్తీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్ 2' విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాను సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ వెల్లడించింది. 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాలో కార్తీ మరోసారి పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నాడు. ఇప్పటికే మొదటి భాగం యాక్షన్, థ్రిల్లింగ్ అంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకోగా, రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు చిత్ర బృందం చెబుతోంది. ఈ చిత్రంలో కార్తీ సరసన మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రముఖ నటుడు ఎస్‌జే సూర్య 'బ్లాక్ డాగర్' పాత్రలో పవర్‌ఫుల్ విలన్‌గా కనిపించనుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. అలాగే కమెడియన్ యోగి బాబు కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. సాంకేతిక విభాగం కూడా ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, జార్జ్ సి విలియమ్స్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విజయ్ వేలుకుట్టి ఎడిటింగ్ చేయగా, యాక్షన్ సన్నివేశాలను దిలీప్ సుబ్బరాయన్ రూపొందిస్తున్నారు. మొదటి భాగాన్ని మించిన యాక్షన్, మరింత థ్రిల్లింగ్ అంశాలతో 'సర్దార్ 2'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్ర యూనిట్ చెబుతోంది. విడుదల తేదీ ఖరారవడంతో కార్తీ అభిమానుల్లో సినిమా పట్ల ఉత్సాహం మరింత పెరిగింది.

## 'ధర్మన్'గా రానున్న రజినీకాంత్ కొత్త సినిమా

సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'తలైవర్ 173' టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు 'ధర్మన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. "ధర్మం వర్ధిల్లుతుంది" అనే ట్యాగ్‌లైన్‌తో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. పోస్టర్‌ను బట్టి చూస్తే ఈ చిత్రంలో రజినీకాంత్ డాక్టర్ పాత్రలో కనిపించనున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ చిత్రాన్ని ఉలగనాయగన్ కమల్ హాసన్ తన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. 'ఓ మై కడవులే', 'డ్రాగన్' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, అన్బరివ్ మాస్టర్స్ యాక్షన్ కొరియోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. రజినీకాంత్, కమల్ హాసన్ కాంబినేషన్‌లో ఈ సినిమా తెరకెక్కుతుండటంతో కోలీవుడ్‌లో భారీ చర్చ నడుస్తోంది. రెండు లెజెండ్లు ఒకే ప్రాజెక్ట్ కోసం కలిసి పనిచేస్తుండటంతో అటు రజినీ అభిమానులు, ఇటు కమల్ అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. టైటిల్ అనౌన్స్‌మెంట్‌తోనే 'ధర్మన్' సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుండగా, మిగతా నటీనటుల వివరాలను చిత్ర బృందం త్వరలో వెల్లడించే అవకాశం ఉంది.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com